

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 30-04-2022 సంపుటి: 03 సంచిక: 226 పేజీలు: 4 వెల: రూ 3-00


# ఉన్నత విద్యపై సమీక్ష..

## సీఎం జగన్ కీలక ఆదేశాలు



అమరావతి: తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నత విద్యపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ( జీఈఆర్) గణనీయంగా పెరగాలని, అందుకే విద్యాదీవెన, వసతి దీవెన అమలు చేస్తున్నామన్నారు. "పూర్తిస్థాయి ఫీజు రియింబర్స్ మెంట్‌ను విద్యా దీవెన కింద అమలు చేస్తున్నాం. వసతి ఖర్చులూ పెట్టుకోలేక చదువులు ఆపేసే పరిస్థితులు ఉండకూడదని, వసతి దీవెన తీసుకు వచ్చామని" ఆయన అన్నారు.గతంలో కన్నా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో( జీఈఆర్) పెరిగిన మాట వాస్తవమేకాని, దీంతో మనం సంతృప్తి చెందకూడదుజీఈఆర్ గణనీయంగా పెరగాలికచ్చితంగా దీన్ని లక్ష్యంగా పెట్టుకోవాలిజీఈఆర్ 80శాతానికి పైగా ఉండాలిఉద్యోగాలను కల్పించే చదువులు దిశగా కోర్సులు ఉండాలిఇప్పుడున్న కోర్సులకు సంబంధించి అనుబంధకోర్సులు, ప్రత్యేక కోర్సులు తీసుకురావాలికమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకు వీలుగా ఇంగ్లిషుపై పట్టు, ప్రావీణ్యం విద్యార్థులకు రావాలివీటిపై అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలిజీఆర్‌ఈ, జీ మ్యాట్ పరీక్షలపైన కూడా విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వాలన్న సీఎంఇంతకుముందులా కాకుండా ఫీజురీయింబర్స్ మెంట్, వసతి దీవెనలను ఒక పిల్లాడికే పరిమితం చేయడంలేదుఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నారో, అంతమందికీ విద్యాదీవెన, వసతి దీవెన ఇస్తున్నాం?ఇంతకుముందు చదివించే స్తోమత లేక, చాలామంది అబ్బాయి చదువుకుంటే చాలు అని.. అమ్మాయిలను పై చదువులకు పంపలేని పరిస్థితులు ఉండేవి?అలాంటి పరిస్థితులను పూర్తిగా తీసేయడానికి ఇంట్లో ఉన్న పిల్లలు అందరికీ కూడా విద్యాదీవెన, వసతి దీవెన వర్తింపు చేస్తున్నాం?రాష్ట్రంలో వెనుకబడ్డ ప్రాంతాల్లో అమ్మాయిలు చదువులకు దూరమవుతున్నారువీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారిలో చైతన్యం తీసుకురావాలికర్నూలు పశ్చిమ ప్రాంతం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్న సీఎంఉత్తమ యూనివర్సిటీలుగా...రాష్ట్రంలో 4?5 యూనివర్శిటీలను ఎంపిక చేసుకుని, దేశంలో ఉత్తమ యూనివర్శిటీల స్థాయికి తీసుకెళ్లాలని సీఎం ఆదేశం?దీన్ని ఒక లక్ష్యంగా తీసుకుని ముందడుగులు వేయాలని సీఎం ఆదేశం.పట్టభద్రులకు తప్పనిసరిగా 10 నెలల ఇంటర్న్‌షిప్.కోర్సులో భాగంగా వీరికి ఇంటర్న్‌షిప్.మూడు విడతల్లో ఇంటర్న్‌షిప్. మొదటి ఏడాది 2 నెలలు, రెండో ఏడాది 2 నెలలు, మూడో ఏడాది 6 నెలల ఇంటర్న్‌షిప్.రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న దాదాపు 30 నైపుణ్యకాలేజీల్లో కూడా ఇంటర్న్‌షిప్ కోసం ఏర్పాట్లు చేయాలన్న సీఎం?ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక డిగ్రీ కాలేజీ ఉండాలినియోజకవర్గంలో ఉన్న జూనియర్ కాలేజీని డిగ్రీకాలేజీ స్థాయికి తీసుకెళ్లాలిదీనికోసం నాడు నేడు కింద ఈ పనులు చేపట్టాలిఅత్యుత్తమంగా డిగ్రీ విద్య..ఈ కాలేజీలను అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి ఒక వ్యవస్థను తీసుకురావాలిచదువులు ఏదోరకంగా సాగితే చాలు అన్నవాళ్లు డిగ్రీ కోర్సులను ఎంచుకునే భావన ఇవాళ దేశంలో ఉందికానీ విదేశాల్లో డిగ్రీ అన్నది చాలా అత్యుత్తమ కోర్సుగా భావిస్తారుమన రాష్ట్రంలో కూడా డిగ్రీకోర్సులను సమర్థవంతంగా తీసుకురావాలిఇప్పుడున్న డిగ్రీకాలేజీలను ఆ స్థాయిలో అభివృద్ధి చేయాలిమన ఆంధ్రప్రదేశ్‌లో డిగ్రీకాలేజీలో జాయిన్ అయ్యారంటే... ఆ విద్యార్థికి మంచి విజ్ఞానం రావాలిడిగ్రీ విద్య ? ప్రత్యేక యూనివర్సిటీ పరిధిలో..రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ డిగ్రీకాలేజీలను జేఎన్టీయూ తరహాలో ఒక ప్రత్యేక యూనివర్శిటీ లాంటి వ్యవస్థ కిందకు తీసుకురావాలిఇందులో మంచి పరిజ్ఞానం ఉన్నవారిని ప్రతిపాదిత వ్యవస్థకు నేతృత్వం వహించేలా చూడాలిడిగ్రీ కోర్సులకు విలువను జోడించండిదేశంలో డిగ్రీ చదవాలనుకుంటే ఏపీకి రావాలని అనుకునేట్టుగా ఉండాలిఏపీలో డిగ్రీలు చదివితే.. మంచి జీతాలు వచ్చే పరిస్థితిని తీసుకురావాలిబోధన సిబ్బంది భర్తీకి గ్రీన్ సిగ్నల్..టీచింగ్ ఫ్యాకల్టీలో ఎక్కడ ఖాళీలు ఉన్నా వెంటనే భర్తీచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలిటీచింగ్ స్టాఫ్ నియామకంలో ఎక్కడా సిఫార్సులకు తావు ఉండకూడదుఇక్కడ రాజీపడితే విద్యార్థులకు తీవ్ర నష్టం ఏర్పడుతుందిసమర్థులైన వారిని, ప్రతిభ ఉన్నవారిని టీచింగ్ స్టాఫ్‌గా తీసుకోవాలివారికీ పరీక్షలు నిర్వహించి... ఎంపిక చేయాలిటీచింగ్ స్టాఫ్ కమ్యూనికేషన్ల నైపుణ్యాన్నికూడా పరిశీలించాలి.యూనివర్శిటీల్లో క్రమశిక్షణ, పారదర్శకత అత్యంత ముఖ్యమైనవి.ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలి: అధికారులకు సీఎం ఆదేశం.ఈ సమీక్షా సమావేశానికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, సీఎస్ సమీర్ శర్మ, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు, ఏపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్, ఆర్‌జీయూకెటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె సి రెడ్డి, ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమ చంద్రారెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రమ్య హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష

గుంటూరు, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన బీటెక్ విద్యార్థిని రమ్య హత్య కేసులో గుంటూరు ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు నిచ్చింది. గతేడాది ఆగస్టు 15వ తేదీన పట్టపగలే నడిరోడ్డుపై రమ్యను కుంచాల శశికృష్ణ అనే యువకుడు అత్యంత దారుణంగా కత్తితో పొడిచి చంపాడు. ఈ కేసులో 9 నెలల పాటు విచారణ కొనసాగించిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు..




నిందితుడికి ఉరి శిక్షను ఖరారు చేస్తూ తుది తీర్పును శుక్రవారం వెల్లడించింది. ఈ క్రమంలో రమ్య కుటుంబ సభ్యులు కోర్టు తీర్పును స్వాగతించారు. నిందితుడికి సరైన శిక్ష పడిందన్నారు. తమ బిడ్డ ఆత్మకు శాంతి చేకూరేలా కోర్టు తీర్పు ఉందని రమ్య తల్లిదండ్రులు చెప్పారు.అయితే ఈ హత్య కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేశారు. నిందితుడు శశికృష్ణను నరసరావుపేట సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత 36 మంది ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. అనంతరం 15 రోజుల్లోనే పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ శారదామణి 28మందిని విచారించగా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాంగోపాల్ వద్ద సాక్షులు వాంగ్మూలం ఇచ్చారు. 9 నెలల పాటు విచారణ కొనసాగింది. కీలకమైన సీసీ టీవీ వీడియోను పరిశీలించిన న్యాయమూర్తి ఇరువర్గాల వాదనలు విని ఈనెల 26న విచారణ పూర్తి చేశారు. ఇవాళ తుదితీర్పును కోర్టు వెల్లడించింది.గుంటూరు జిల్లాలోని పరమయ్యకుంటకు చెందిన రమ్యను శశికృష్ణ ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేశాడు. శశికృష్ణ వేధింపులను భరించలేక అతన్ని ఫోన్ నంబర్‌ను రమ్య బ్లాక్ చేసింది. దీంతో మరింత రెచ్చిపోయిన శశికృష్ణ ఆమెపై పట్టపగలే కత్తితో దాడి చేశాడు. రమ్య శరీరంపై 8 కత్తిపోట్లను వైద్యులు గుర్తించారు. తన ప్రేమ కాదన్నదన్న కోపంతో గత ఏడాది ఆగస్ట్ 15వ తేదిన చుట్టుపక్కల వారు చూస్తుండగానే నడిరోడ్డుపై రమ్యను కత్తితో పొడిచి హత్య చేశాడు. హత్య విజువల్స్ సిసి కెమెరాలో రికార్డయ్యాయి. నిందితుడు శశికృష్ణను నరసరావుపేట సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేయటంతో పాటు 15రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేశారు.కేసులో డీఎస్పీ రవికుమార్ ని విచారణ అధికారిగా నియమించారు. ఆయన మొత్తం 36మంది సాక్షులను విచారించి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ప్రత్యేక కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.శారదామణి కూడా వారిలో 28మందిని విచారించారు.ఆ తర్వాత ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాంగోపాల్ వద్ద సాక్షులు వాంగ్మూలం ఇచ్చారు. డిసెంబర్ 7 నుంచి మార్చి 2వ తేది వరకూ ఈ ప్రక్రియ జరిగింది. ఆ తర్వాత ఇరువర్గాల వాదనలు వినటం ప్రారంభించి? మంగళవారంతో పూర్తి చేశారు. హత్య కేసులో కీలకమైన సిసి టివి వీడియోను న్యాయమూర్తి పరిశీలించారు. ఈనెల 29వ తేదిన తీర్పు వెలువరిస్తానని ప్రకటించారు. నిందితుడు శశికృష్ణ గుంటూర్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.రమ్య హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. రాజకీయపార్టీలు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించాయి. జాతీయ ఎస్సీ కమిషన్ కూడా ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపింది.

# కరెంటు లేక జనరేటర్ మీద ఉండాల్సి వచ్చింది

## కేటీఆర్ మాటలకు బొత్స కౌంటర్..



అమరావతి ఏప్రిల్ 29 ;నీ గొప్ప కోసం పక్కోడ్ని చిన్నతనం చేస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు ఏపీ అధికారపక్షం పరిస్థితి అలానే ఉంది. నిన్నటివరకు తమ పాలన మీద విపక్షాలు విమర్శలు చేస్తే వారిని ఇష్టారాజ్యంగా తిట్టేయటం.. మీడియా వేలెత్తి చూపిస్తే.. పచ్చ మీడియా అంటూ ప్రచారం చేయటం.. సోషల్ మీడియాలో ఎవరైనా విమర్శలు చేస్తే..ఏదో ఒక తోక తగిలించేసి.. అదంతా పచ్చి అబద్ధమన్నట్లుగా చెప్పటం అలవాటైన వైసీపీ నేతలకు ఇప్పుడు కొత్త కష్టం వచ్చి పడింది. ఇటీవల కాలంలో వారికి ఇలాంటి టాస్కు ఎదురు కాలేదు.ఏమైందో ఏమో కానీ.. తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్.. పక్క రాష్ట్రానికి చెందిన తన స్నేహితుడు సంక్రాంతికి ఊరికి వెళ్లి హైదరాబాద్ కు వచ్చిన తర్వాత ఫోన్ చేయటం..పక్క రాష్ట్రం (ఏపీని ఉద్దేశించి) లో కరెంటు.. నీళ్లు.. రోడ్లు ఏమీ లేవని.. పరిస్థితి దారుణంగా ఉందన్న మాట వైసీపీ నేతలకు ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది.ఎందుకంటే.. తెలంగాణ అధికారపక్షాన్ని ఉద్దేశించి ఏమంటే.. ఏమవుతుందో తెలీదు. ఎందుకంటే.. ఏపీ మంత్రులు కావొచ్చు.. అధికార పక్షానికి చెందిన నేతలు కావొచ్చు. వారి ఆస్తులు మొత్తం హైదరాబాద్ లోనే ఉన్నాయి.తమ ప్రత్యర్థుల మీద విరుచుకుపడినట్లుగా మాట్లాడితే.. చర్యకు ప్రతిచర్య ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే.. ఏపీ రాష్ట్రంలోని పరిస్థితి గురించి మంత్రి కేటీఆర్ అన్నేసి మాటలు అన్న తర్వాత కూడా ఆచితూచి అన్నట్లుగా మాట్లాడుతున్నారు.సాధారణంగా మంత్రి బొత్స సత్యనారాయణకు కోపం వస్తే ఊగిపోతారు. తమ ప్రత్యర్థులపై తీవ్ర పదజాలాన్ని వాడేస్తారు. అలాంటి ఆయన సైతం మంత్రి కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలు ఆచితూచి అన్నట్లుగా ఉన్నాయే తప్పించి.. నేచురల్‌గా సత్తిబాబు సీరియస్ అయితే ఎలా ఉంటుందో అలా మాత్రం లేదన్న మాట వినిపిస్తోంది.ఇంతకీ ఆయన ఏమన్నారంటే.. ఏపీ గురించి కేటీఆర్ ప్రత్యక్షంగా ఏమీ చూడకుండానే ఆయన స్నేహితుడు చెప్పిన మాటల్ని నిజమని నమ్మి ఆయన వ్యాఖ్యలు చేశారన్నారు. తలెంగాణ పరిస్థితులను ప్రత్యక్షంగా చూసినా తాను ఎవరికి చెప్పుకోవటం లేదు కదా? అని వ్యాఖ్యానించారు. 'ఏపీ గురించి కేటీఆర్ కు ఎవరో స్నేహితుడు ఫోన్ చేశాడేమో. నేను నిన్నటి వరకు హైదరాబాద్ లోనే ఉన్నా.కరెంటు లేక జనరేటర్ మీద ఉండాల్సి వచ్చింది. ఇది నేనెవరితోనూ చెప్పలేదు కదా?"అని వ్యాఖ్యానించారు. బాధ్యత కలిగిన స్థాయిలోఉండి అలా మాట్లాడకూడదన్న బొత్స.. మీ దగ్గర జరిగిన డెవలప్ మెంట్ ఏమిటో చెప్పుకోవచ్చు కానీ పక్క రాష్ట్రాలను విమర్శించొద్దు అంటూ చెప్పిన మాటలు బొత్స నోటి నుంచి వచ్చిన తీరు చూస్తే.. వినయ విధేయత రామా అన్నట్లు ఉన్నాయన్న మాట వినిపిస్తోంది. కస్సుమనాల్సిన వేళ.. ఇంత ఆచితూచి మాటలెందుకంటారు బొత్స బాబాయ్?

# కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి

అనంతపురం: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఏపీ పరిస్థితులపై చేసిన వ్యాఖ్యాలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఏపీలో విద్యుత్ కోతలు లేవన్నారు. బొగ్గు అధికంగా కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రోడ్లు బాగుపడ్డాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందునే కేటీఆర్ అలా మాట్లాడి ఉండొచ్చునని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏపీలో బాగాలేదు.. తెలంగాణలో బాగుందంటే ఓట్లు పడొచ్చని కేటీఆర్ భావించి ఉండవచ్చునని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు... ఏపీలో కరెంట్, నీటి సౌకర్యం లేదని, రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. ఈ విషయం ఏపీకి వెళ్లొచ్చిన తన స్నేహితులు చెబుతున్నారన్నారని, ఏపీలో ఉంటే నరకంలో ఉన్నట్లు ఉందని చెప్పారన్నారు. అనుమానం ఉంటే.. ఎవరైనా ఏపీకి వెళ్లిరండని మంత్రి కేటీఆర్ సలహా ఇచ్చారు. ఏపీతో పోలిస్తే..తెలంగాణలో రోడ్లు, మౌలిక సదుపాయాలు బాగున్నాయని చెప్పారు.



# రమ్య హత్య కేసులో సంచలన తీర్పు.. సీఎం జగన్ ట్వీట్

అమరావతి: విద్యార్థిని రమ్య హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. "ఈ కేసు విషయంలో వేగంగా దర్యాప్తు పూర్తిచేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ శాఖకు అభినందనలు" అని సీఎం వైఎస్ జగన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గుంటూరులో గత ఏడాది ఆగస్టు 15న జరిగిన బీటెక్ విద్యార్థిని నల్లపు రమ్య (20) హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడు శశికృష్ణకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సుదీర్ఘ వాదనల తర్వాత కోర్టు ఉరిశిక్ష విధించింది.హత్య జరిగిన రెండోరోజే సీఎం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.పది లక్షల్ని రమ్య తల్లి జ్యోతికి అప్పటి హోంమంత్రి సుచరిత అందించారు. ఆ కుటుంబానికి మూడునెలలపాటు నిత్యావసరాలకు నగదు ఇచ్చారు. అదేనెల 20వ తేదీకల్లా రమ్య తల్లికి నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద గుంటూరులో ఇంటిస్థలం పట్టా ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం మరో రూ.8,25,000 అందజేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు ఇచ్చింది.రమ్య సోదరి మౌనికకు సెప్టెంబర్ 16న రెవెన్యూ విభాగంలో ఉద్యోగం ఇచ్చింది. ఆమె ఐదేళ్లలోగా డిగ్రీ పూర్తిచేసుకునే అవకాశం కల్పించారు. వారు కోరిన విధంగా వారి సొంత గ్రామమైన అమృతలూరు మండలం యలవర్రులో రూ.1,61,25,300తో ఐదెకరాల పట్టా భూమి కొనుగోలు చేసి రమ్య తల్లి పేరున రిజిస్టర్ చేసింది. రమ్య హత్యకేసు విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరు బావుందని జాతీయ ఎస్సీ కమిషన్ వైస్‌చైర్మన్ అరుణ్‌హల్దార్ కొనియాడారు. హత్య అనంతరం గుంటూరు వచ్చిన కమిషన్ బృందం.. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీ ప్రభుత్వం చాలా పాజిటివ్‌గా స్పందించిందని కొనియాడింది.

# ఏపీ సీఎం జగన్ పరిస్థితి 'ఆడలేక మద్దెలవోడు ' అన్నట్లు ఉంది : వైసీపీ ఎంపీ

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిస్థితి ' ఆడలేక మద్దెలవోడు' అన్నట్లు ఉందని వైసీపీ రెబెల్ ఎంపీ



రఘురామకృష్ణ రాజు ఆరోపించారు. తమ చేతగాని తనాన్ని దుష్టచతుష్టయంపై వేయడం మూర్ఖత్వమని అన్నారు. నవరత్నాల పేరిట ఇచ్చే స్కీంలన్నీ గత ప్రభుత్వాలు ఇచ్చినవేనని పేర్కొన్నారు. పాతవాటికి కొత్త పేర్లు పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను మరిచిపోయారని ఆరోపించారు.ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో వైసీపీ భూస్థాపితం అయ్యిందని తెలిపారు. అనేక వైఫల్యాలు ఉన్నందున ఏపీలో 175 సీట్లు వైసీపీకి ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. ఈరోజు ఎన్నికలు జరిగితే అధికార వైసీపీకి 25 నుంచి 30 సీట్లు మాత్రమే వస్తాయని తెలిపారు. సీఎంగా గెలిచిన తరువాత జగన్ ప్రజల్లోకి వెళ్లడం లేదని, అతడికి ఉన్న పరిస్థితుల కారణంగా బందోబస్తుతో బయటకు వెళ్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉందని , ఆర్థిక నిపుణులు ఏపీ ఆర్థిక స్థితిపై చివాట్లు పెడుతున్నారని అన్నారు.

# సంపాదకీయం

శనివారం ,30-04-2022

## సీట్ల దందాకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

దేశంలో మెడికల్ పిజి సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలో ఎప్పట్లాగే మెడికల్ పిజి సీట్ల బ్లాక్ దందా మొదలయింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యాలు నీట్ లో ర్యాంకు వచ్చిన ఇతర రాష్ట్రాల విద్యార్థులతో కుమ్మక్కై వారితో మన రాష్ట్రంలో ఉన్న మేనేజ్‌మెంట్ సీట్లకు దరఖాస్తు చేయిస్తున్నారు. సీటు కేటాయింపు అయ్యాక దరఖాస్తు చేయించిన ఇతర రాష్ట్రాల విద్యార్థులను, తిరిగి ఆ సీట్లను వదులుకునేలా చేస్తున్నారు. దీంతో మేనేజ్‌మెంట్ సీట్లను ఎన్‌ఆర్ఐ సీట్లుగా మార్చి ఒక్కో సీటుకి రూ. 2 కోట్లకు అమ్ముకుంటున్నారు. నిబంధనలో ఉన్న లొసుగులను వాడుకొని ప్రైవేట్ మెడికల్ మేనేజ్‌మెంట్ మాఫియా కోట్లాది రూపాయల ఫీజుల దోపిడీ చేస్తుంది? మన రాష్ట్రంలో 26 మెడికల్ కాలేజీలు ఉన్నా యి. దాంట్లో సగం సీట్లను కన్వీనర్ కోటాలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు ప్రకారం భర్తీ చేస్తారు. మిగతా సగం సీట్లలో మూడు కేటగిరీల వారీగా సీట్ల భర్తీ ప్రక్రియ ఉంటుంది.మొదటి కేటగిరిలో 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేస్తారు. రెండవ కేటగిరీలో 30 శాతం సీట్లను ఎన్‌ఆర్ఐ, ఎన్నారై స్పాన్సర్డ్ సీట్లుగా భర్తీ చేస్తారు. మూడవ కేటగిరిలో మిగతా 20 శాతం సీట్లను మెడికల్ కాలేజీలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు ప్రకారం తమకు ఇష్టం వచ్చిన వారికి ఇవ్వొచ్చు. రెండవ, మూడవ కేటగిరీలో ఫీజు గరిష్ఠంగా రూ. 72 లక్షలు మాత్రమే ఉంది. కానీ ప్రైవేట్ మెడికల్ మేనేజ్‌మెంట్ మాఫియా వేరే రాష్ట్ర విద్యార్థులతో ఇక్కడ దరఖాస్తు చేయించి పథకం ప్రకారం ఆ సీట్లను బ్లాక్ చేసి, ఆ తర్వాత వాటిని ఎన్‌ఆర్ఐ, ఎన్నారై స్పాన్సర్డ్ సీట్లుగా, మూడవ కేటగిరీ సీట్లుగా మార్చి ఒక్కో సీటుకు కోట్లాది రూపాయలను దండుకుంటుంది. నకిలీ ఏజెంట్‌లను తయారు చేసి బీహార్, ఒడిశా విద్యార్థులతో ఈ తతంగాన్ని నడుపుతున్నారు. మొత్తం 500 సీట్లలో ఈ బ్లాక్ దందా నడిచింది. ఈ బ్లాక్ దందాతో అర్హత, సామర్థ్యం ఉండి అనేక మంది తెలంగాణ బిడ్డలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది.అర్హత, సామర్థ్యం లేనివాళ్లు, కేవలం ఆర్థిక, అంగబలం ఉపయోగించి మెడికల్‌లో పిజిలు చేసే అవకాశం ఉంది. కోట్లాది రూపాయలను వెచ్చించి చదివే వీరు డాక్టర్ లు అయ్యాక రేపు సమాజంలో ఫీజుల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తారే తప్ప, సేవాగుణాన్ని కలిగి ఉండరు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వైద్యానికి దూరం అయ్యే ప్రమాదం ఉంది. ప్రజలకు వైద్యం అందక ఆరోగ్యరంగం తీవ్రమైన సంక్షోభంలో పడే అవకాశం ఉంది. మన దేశంలో డాక్టర్ల కొరత చాలా తీవ్రంగా ఉంది. ప్రతి వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతుంది. కానీ దేశంలో 1800 మందికి ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారు. దేశంలో దాదాపు 5 లక్షల మంది డాక్టర్లు కొరత ఉంది. మూడు లక్షల మంది నర్సుల కొరత ఉంది. దాదాపు లక్ష 30 వేల మంది ఎంబిబిఎస్ చేసిన డాక్టర్లు కేవలం పిజి ఎగ్జావ్? రాయడం కోసం ప్రాక్టీసును వదిలేసి ప్రిపేర్ అవుతున్నారు. దేశంలో వైద్య విద్య సీట్ల కొరత దీనికి నిదర్శనం. భారత దేశ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా, జనాభా ప్రకారం మెడికల్ సీట్ల సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరం ఉంది. నేడు కేవలం 25 వేల పిజి సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీనిని ఐదు రెట్లు పెంచాలి. వైద్య కళాశాలలను, రీసెర్చ్ సెంటర్‌లు పెంచి వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలు చేయడానికి ప్రోత్సహించాలి.కరోనా లాంటి విపత్తులు వస్తే దేశంలో ఉన్న ప్రజలంతా భయకంపితులైనారు. ప్రజలంతా ప్రాణా లు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ బతికారు. అనేక మంది ప్రజలు వైద్యం, ఆక్సిజన్ అందక నిర్లక్ష్యంగా చనిపోయారు. కార్పొరేట్ ప్రైవేట్ హాస్పిటల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి దోపిడీకి గురయ్యారు. భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేయాలి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి. వైద్య విద్య సీట్లను, యుద్ధప్రాతిపదికన పెంచి డాక్టర్ చదువు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి. దేశంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు అధికంగా రాజకీయ నాయకులవి. కొంతమంది ప్రైవేట్ మెడికల్ మేనేజ్‌ంట్‌లు అధికారులతో కుమ్మక్కై ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ బ్లాక్ దందాను గుర్తించి కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, విసిలను కలిస్తే తప్ప అధికారుల్లో చలనం రాలేదు.అంటే ఈ మెడికల్ మాఫియా ఏ స్థాయిలో పని చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రైవేట్ మెడికల్ మేనేజ్‌మెంట్ మాఫియా అనేక ఏళ్ళ నుండి ఇలాగే చేస్తుంది. దీంతో అనేక మంది తెలంగాణ బిడ్డలు తీవ్రంగా నష్టపోతున్నారు. కాబట్టి ఇప్పటికైనా అధికార యంత్రాంగం, వైద్య విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ బ్లాక్ దందాపై విచారణ నిర్వహించి, మెడికల్ కాలేజ్ మాఫియాను నియంత్రించాలి. బ్లాక్ చేసిన సీట్లను, న్యాయంగా రావలసిన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. బ్లాక్ చేసిన ఇతర రాష్ట్ర విద్యార్థులు, ఈ తతంగాన్ని నడిపిన ప్రైవేట్ మెడికల్ యాజమాన్యాలపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలి.

# శారదా పీఠం చుట్టూ చెక్కర్లు

విశాఖపట్టణం, ఏప్రిల్ 29, విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా చేయాలనుకున్న సీఎం జగన్ ఆశయం మరోలా సిద్ధించింది. ప్రస్తుతం రాష్ట్రంలో పొలిటికల్ ఎగ్జిక్యూషన్ అంతా విశాఖలోని శారదా పీఠం నుంచే నడుస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఫైర్ బ్రాండ్‌గా పేరొందిన రోజా అయినా.. కొత్త మంత్రి విడదల రజని అయినా.. పదవీ బాధ్యతలు స్వీకరించారో లేదో స్వామీజీ పాదాల చెంతకు చేరుకున్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ అయితే అంతకంటే ముందే తన హాజరు శారదాపీఠంలో వేయించుకున్నారు. సీఎం జగన్ అమితంగా విలువ ఇస్తున్న నేపథ్యంలో విశాఖ శారదా పీఠానికి ఇటీవల ప్రాముఖ్యత పెరిగింది. సాధారణంగా మంత్రులకే సీఎం వద్ద అపాయింట్ మెంట్ దొరకడం అంత సులభం కాదనే పేరుంది. దీంతో తమ కష్టాలూ విజ్ఞప్తులూ విశాఖకు వచ్చి స్వామీజీకి చెప్పుకుంటే ఆయనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతారని వైసీపీలో ఒక నమ్మకం బయలుదేరింది. సిఫార్సులు కావొచ్చు ..మరే పనైనా కావొచ్చు.. ఒక్కసారి శారదా పీఠానికి వస్తే చాలు పనైపోతుందనే నమ్మకం కలగడంతో అధికారులు, మంత్రులు, ఇతర నేతలు చలో శారదా పీఠం అంటున్నారు.కొత్త మంత్రివర్గంలో సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మత్స్యకార మంత్రి సీదిరి అప్పలరాజు, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, పర్యాటక శాఖ మంత్రి రోజా, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు ఇప్పటివరకు స్వామి కాళ్లపై పడి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పర్యాటక శాఖ మంత్రి రోజా అయితే విశాఖలోనే అతిగొప్ప పర్యాటక ప్రాంతంగా శారదా పీఠాన్ని తీర్చిదిద్దుతానని స్వామీజీ పాదాలకు మొక్కిన అనంతరం మీడియాకు తెలిపారు.కేవలం రాష్ట్ర మంత్రులే కాదు.. పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం స్వామి స్వరూపానంద సరస్వతిని దర్శించుకుంటున్నారు. ఆరోగ్య చికిత్స కోసం వైజాగ్ వచ్చిన హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ కూడా ఇటీవల స్వామీజీని కలిశారు. ఒడిశా, తెలంగాణ నుంచి మంత్రులు రావడం కూడా ఇప్పుడు సాధారణమైంది. మన రాష్ట్ర ఐఏఎస్ అధికారుల్లో కొందరు కూడా స్వామి అనుగ్రహం కోసం శారదా పీఠానికి వస్తున్నారు. దీంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా అందరి దృష్టి శారదా పీఠం వైపే కేంద్రీకృతమైంది.ఒక పదేళ్ల క్రితం వరకూ విశాఖ శారదా పీఠం అంటే ఏమిటో ఎవరికీ తెలిసేది కాదు. ఉత్తరాది హిమాలయాల్లోనూ.. వారణాసిలోనూ పర్యటించిన స్వామి స్వరూపానంద వద్ద రాజశ్యామల అమ్మవారిని ఆవాహన చేసుకునే మంత్రాలపై స్వామీజీ పట్టు సాధించారని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. క్రీస్తుపూర్వం రాజులు యుద్ధానికి వెళ్లేటప్పుడు రాజశ్యామల యాగం చేసేవారని, అలా చేసిన వారు ఖచ్చితంగా యుద్ధంలో విజయం సాధించే వారని ఆశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దేశంలోనే మొదటిసారిగా ఈ రాజశ్యామల అమ్మవారిగా చెప్పుకునే దేవత గుడి శారదా పీఠంలోనే కట్టారని, అందుకే ఇక్కడకు మంత్రులు క్యూ కడుతున్నారని శారదా పీఠం వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణ సీఎం కేసీఆర్ గతంలో స్వరూపానంద స్వామిజీని కలిసిన వారిలో ముఖ్యులు. రాజశ్యామల యాగం జరిపించిన ఆయన ఈ స్వామిజీకి పెద్ద ఎత్తున ప్రాచుర్యం కలిగించారు. అనంతరం వైసీపీ అధినేత జగన్ శారద పీఠం బాట పట్టారు. విపక్షంలో ఉండగా 4 సార్లు, అధికారంలోకి వచ్చాక 4 సార్లు శారద పీఠం దర్శనం చేసుకున్నారు. ఇవికాక ఉత్తరాదిన స్వామీజీ ఉండగా అక్కడకు వెళ్లి మరీ గంగలో మునిగారు జగన్. ఆ ఫొటోలు పెద్దఎత్తున వైరల్ కూడా అయ్యాయి. ఇక అనుకున్నట్టుగానే సీఎం జగన్ అధికారంలోకి రావడంతో స్వరూపానంద పేరు మార్మోగింది. సాక్షాత్తూ సీఎం స్వామీజీ వద్దకు వస్తుండడంతో మంత్రులకు సీఎం వద్దకు తమ విన్నపాలు ఎలా చేరవేయాలో అర్థమైంది.

దీంతో చలో శారద పీఠం అని విశాఖకు పరిగెత్తుకు వస్తున్నారు సదరు మంత్రులు. ఇది మెదటి విడత కేబినెట్ మంత్రులకంటే ప్రస్తుతం ప్రమాణ స్వీకారం చేసిన మంత్రుల్లో ఎక్కువగా కనబడుతున్నది.స్వరూపానంద స్వామిజీ చాలా భిన్నమైన వ్యక్తి. తెలుగు రాష్ట్రాల్లోని మిగతా స్వాములు కొంతకాలం వైభవంతో వెలిగినా రాజకీయాల్లో తమ ముద్ర వేయాలని ప్రయత్నించి అభాసు పాలవ్వడమే కాకుండా తమ అభిమాన ముఖ్యమంత్రులకూ దూరం అయ్యారు. స్వరూపానంద మాత్రం తాను స్వయంగా రాజకీయాలపరంగా లబ్ధి పొందాలని చూడకపోవడం విశేషం . కేవలం ముఖ్యమంత్రికి, మంత్రులకూ మధ్య ఒక వారధిలా పనిచేయడానికి మాత్రమే పరిమితం కావడంతో రాష్ట్రంలోని మంత్రులకు ఆయనపై గురి కుదిరింది. ఒడిశా మంత్రి ఏకంగా స్వామిజీ సూచన మేరకు తన రాష్ట్రంలో ఏకంగా రాజశ్యామల అమ్మవారికి గుడి కూడా కట్టేస్తున్నారు. ఇక స్వరూపానంద చెప్పిన పనులన్నీ రాష్ట్ర ప్రభుత్వంలో జరిగిపోతున్నాయని వినికిడి. దేవాదాయ శాఖలో స్వామీజీ మాటే వేదం. సింహాచలం కావొచ్చు.. రుషికొండ వద్ద గల వెంకటేశ్వర స్వామి ఆలయం కావొచ్చు.. స్వామిజీకి చెప్పాకే ఏ కార్యక్రమమైనా అన్నట్టు పరిస్థితి ఉందని విశాఖవాసులు అనుకుంటున్నారు. ఇక స్వామిజీ అభిమతం మేరకు ఈ మధ్యే భీమిలిలో ప్రశాంత వాతావరణం మధ్య భూమిని కేటాయించింది ప్రభుత్వం. మొత్తంగా ఏపీలో శారద పీఠం ప్రభావం రోజురోజుకూ పెరిగిపోతున్నది.

# మళ్లీ ఆగిపోయిన డీఏ బిల్లులు

ఒంగోలు, ఏప్రిల్ 29, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు జగన్ రెడ్డి సర్కార్ మళ్లీ షాక్ ఇచ్చింది. గత సంవత్సరానికి సంబంధించిన కరువుభత్యం బిల్లులను అప్ లోడ్ చేసు అవకాశం లేకుండా సీఎఫ్ఎంఎస్ లో లాగిన్ ను మూసేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 వేల కోట్ల రూపాయల డీఏ బిల్లులు చెల్లింపులు లేక నిలిచిపోయాయి. తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై దెబ్బకొట్టిన ఏపీ ప్రభుత్వంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. నిధుల కొరత కారణంగా డీఏ బిల్లులను ఇప్పటికే ఏపీ సర్కార్ వెనక్కి పంపేయడం చర్చనీయాంశంగా మారింది.ఒక్క ఛాన్స్ అంటూ ఏపీలో అధికార పీఠం ఎక్కిన జగన్ రెడ్డి సర్కార్ అవకతవకలు, చేతగానితనం, అనాలోచిత చర్యలు ఒక్కొక్కటిగా వెల్లడవుతూనే ఉన్నాయి. పరిపాలనలో ప్రభుత్వ పెద్దల అనుభవ రాహిత్యం కారణంగా రాష్ట్ర ఖజానాను పూర్తి దివాలా దిశగా నడిపిస్తున్నారు. ఆదాయం వస్తున్నా.. చెల్లింపుల విషయంలో ఏమాత్రం చేవలేక, చేతకాక చేతులెత్తేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. నవరత్నాల పేరు చెప్పి ఖజానాలోని సొమ్మంతా ఇష్టం వచ్చిన రీతిలో ఖర్చుపెట్టేసి, ఆనక అత్యవసర సమయాల్లో, అభివృద్ధి పనుల విషయంలో వైసీపీ సర్కార్ మొండిచెయ్యి చూపిస్తోందని అంటున్నారు.ఖజానాను ఖాళీ చేసేసి, దొరికిన చోటల్లా అప్పులు తెచ్చేసి, ఆపైన ఓవర్ డ్రాఫ్ట్ కూడా వాడేసినా రోజువారీ పాలన సాగించలేని దుస్థితిలోకి ఏపీని నెట్టేసిన జగన్ సర్కార్ ఆ తర్వాత పలు ప్రభుత్వ శాఖల నుంచీ నిధులు తలరించుకుపోయింది. నిజానికి ఏపీకి ఇక అప్పు కూడా పుట్టని దుస్థితి దాపురించింది. అవీ చాలకపోవడంతో పంచాయతీరాజ్ వ్యవస్థలోని అట్టడు స్థాయిలోని పంచాయతీల నుంచి కూడా సొమ్ములు లాగేసుకుంది. తద్వారా గ్రామాల్లో పనులు కొనసాగించలేక సర్పంచ్ ల చేత చిప్పలు చేతపట్టించింది రాష్ట్ర సర్కార్. అయినా దాని కరువు తీరకపోవడంతో ఇప్పుడు ఏకంగా ఉద్యోగుల డీఏ బకాయిల్ని కూడా చెల్లించకుండా మొండికేసే స్థితికి దిగజారిపోయిందని విశ్లేషకులు అంటున్నారు.తాజాగా.. డిస్ట్రిక్ట్ డ్రాయింగ్ ఆఫీసర్ల (డీడీఓల) నుంచి డీఏ బిల్లులు మార్చినెల చివరి వారంలో సబ్ ట్రెజరీలకు వచ్చాయట. వేతనాలు, పింఛన్లు తప్ప మరే బిల్లునూ అప్ లోడ్ చేసేందుకు సీఎఫ్ఎంఎస్ ఛాన్స్ ఇవ్వడం లేదని సబ్ ట్రెజరీ ఉద్యోగుల నుంచి వస్తున్న సమాచారం. జిల్లా సబ్ ట్రెజరీ ఆఫీసులు వాటిని అప్ లోడ్ చేసేందుకు ప్రయత్నిస్తుంటే మంగళవారం సాయంత్ర నుంచే అవి అప్ లోడ్ కావడంలేదట. 'ఇన్ సఫిసియంట్ ఆఫ్ ఫండ్స్' అనే ఆప్షన్ సబ్ ట్రెజరీ ఆఫీసుల కంప్యూటర్ తెరలపై కనిపిస్తోందట. దీంతో ఏపీ వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఏడాది క్రితం డీఏ బిల్లులు చెల్లించకుండా జగన్ రెడ్డి సర్కార్ తమకు తీవ్ర అన్యాయం చేస్తోందని దుయ్యబడుతున్నారు.గత ఏడాది డీఏ ఒక్కొక్కరికి సుమారు 6 వేలు నుంచి లక్ష రూపాయల వరకు రావాల్సి ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికే సంవత్సరం దాటిపోయినా తమ డీఏ బిల్లుల్ని ఇంకా ఎంతకాలం ప్రభుత్వం ఆపుతుందని ఫైరవుతున్నారు.

# కడప ఉత్సవాలకు హాజరుకానున్న సినీ రంగ ప్రముఖులు వాగ్గేయకారులు......

కడప మే నెల 25 నుండి 31 వరకు కడపలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి కళా ఉత్సవాలు మహాసభలకు సినీ ప్రముఖులతో పాటు అనేకమంది వాగ్గేయకారులు హాజరుకానున్నారని ప్రముఖ సినీ దర్శకులు బాబ్జి వెల్లడించారు. గురువారం కడప ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్ర నాయక్ తో కలసి బాబ్జి కళా ఉత్సవాల లోగో ,బ్రోచర్ ను ఆవిష్కరించి అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.ప్రజా

**విభిన్న కళారూపాలతో కడప కు రానున్న కళాకారులు.....**
**ప్రముఖ సినీ దర్శకులు బాబ్జి వెల్లడి....**

చైతన్యం ప్రజలను జాగృతం చేయడంలో ప్రజానాట్యమండలి సేవలు మరువలేనిదన్నారు. ప్రజలు తమ నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని అనేక రకాలైన కళారూపాలతో పాటు అద్భుతమైన పాటలను తీసుకువచ్చి ప్రజల ముంగిట చేర్చింది అన్నారు. మట్టిలో మాణిక్యాల అయినా అనేకమంది కళాకారులను సినిమారంగానికి పరిచయం చేసిందన్నారు.సినిమా ఈ రంగంలో కూడా పేరుకుపోతున్న అనేక విష సంస్కృతి లకు భిన్నంగా ప్రజా వాణి వినిపించడం జరిగిందని వున్నారు. సాంస్కృతిక రంగంలో మార్పులు తీసుకురావాలని ప్రత్యేకమైన ప్రజా సాంస్కృతిక విధానాన్ని తీసుకురావాలని ప్రజానాట్యమండలి పోరాటం చేస్తుందన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్ర నాయక్ మాట్లాడుతూ రాయలసీమ అ నేపథ్యాన్ని కరువు కాటకాలను వలసలను అంశాలుగా తీసుకొని అనేక రకాల కళారూపాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిమంది గ్రామీణ జానపద పౌరాణిక ప్రజా కళాకారులు కడప లో జరిగే మహా సభలకు హాజరవుతున్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి ప్రజల మధ్య కులమతాలతో చిచ్చు పెడుతున్న పాలకుల విధానాలపై కూడా ప్రజా కళాకారులు అనేక రకాల కళారూపాలతో వారం రోజుల పాటు కడప నగరంలో జరిగే ఉత్సవాలు మహాసభలకు హాజరు కానున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు పి చంద్రశేఖర్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి కృష్ణమూర్తి గాలి చంద్ర సి సుబ్రహ్మణ్యం ఎం విజయలక్ష్మి సిపిఐ నాయకులు సావంత్ సుధాకర్ బందెల ఓబయ్య నార్ల ప్రకాశం ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పల్లవోలు రమణ శ్రీనివాసులు సుజనా శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ యువజన సమాఖ్య నాయకులు గంగా సురేష్ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజు పేపర్ లీకే

విజయవాడ, ఏప్రిల్ 29, ఏపీలో టెన్త్ ఎగ్జామ్ క్వశ్చన్ పేపర్ల లీకుల వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. మొన్న తెలుగు, నిన్న హిందీ పేపర్స్ లీకైన ఘటనలు మరువకముందే.. ఇవాళ నంద్యాల నందికొట్కూరులో ఇంగ్లీప్ పేపర్ లీకవడం సంచలనంగా మారింది. పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఏప్రిల్ 29న ఇంగ్లిష్ పరీక్ష జరుగుతోంది. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే (ఉదయం 10 గంటలకు) ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. పరీక్ష పేపర్ లీకేజ్ నేపథ్యంలో జిల్లా విద్యాధికారి ఎగ్జామ్ సెంటర్‌ను పరిశీలించి, ఈ వ్యవహారంపై ఆరా తీశారు. మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక చిత్తూరు జిల్లాలో టెన్త్ పరీక్షల నిర్వహణలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ జిల్లాలో ఏకంగా పరీక్ష కేంద్రాన్నే మార్చేశారు. సెంటర్ కోడ్ ఒక చోట ఉంటే.. పరీక్షల నిర్వహణ మరో చోట జరుగుతోంది. విజయం స్కూల్స్ యాజమన్యం నిర్వాకాన్ని విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల జోక్యం లేనిదే, కేటాయించిన ఎగ్జాం సెంటర్‌లో కాకుండా.. మరోచోట పరీక్ష నిర్వహిచడం అసాధ్యమని పలువురు విమర్శిస్తున్నారు.చిత్తూరు జిల్లాకు చెందిన గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లిలో మరో ఘటన జరిగింది. ఓ టీచర్ ఏకంగా మాల్ ప్రాక్టీస్‌కు యత్నించాడు. క్వశ్చన్ పేపర్‌ను ఫొటో తీసేందుకు ప్రయత్నించిన టీచర్ పవన్‌కుమార్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# జగన్ కు ఫుల్ మార్క్

విజయవాడ, ఏప్రిల్ 29, మామూలుగా శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. కానీ వైసీపీలో మాత్రం జగనాజ్ఞ లేకుండా ఇక్కడి పుల్ల కూడా అక్కడికి ఎవరూ కదపలేరు. అంతా జగన్ ఇష్ట ప్రకారమే...అన్నీ జగన్ కనుసన్నల్లోనే అన్నట్లుగా ఉంటుంది వైసీపీలో పరిస్థితి. అయితే ఫలితం విషయంలో మాత్రం జగన్ సత్ఫలితాలను మాత్రమే తన ఖాతాలో వేసుకుంటారు. వైఫల్యాలను మాత్రం ఎమ్మెల్యేలు, మంత్రుల ఖాతాలో ఆటోమేటిగ్గా పడిపోలాయి.ఇటీవల సర్వేల ఫలితాలంటూ ఏపీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ తమ పార్టీ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకారు. సర్వేలలో తనకు మంచి గ్రేడ్ వచ్చిందని చెప్పుకున్న జగన్ ఎమ్మెల్యేలెవరికీ పాస్ మార్కులు కూడా రాలేదని చెప్పారు. జాగ్రత్తగా ఉండాలనీ, ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలని దాదాపు హెచ్చరికలు జారీ చేసినంత పని చేశారు. అంతా బానే ఉంది.. మూడేళ్లలో వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజలు మెచ్చే విధంగా పని చేయలేకపోయారు.. అయితే జట్లు మొత్తం ఫెయిలైతే.. జట్టు నాయకుడొక్కరే ఎలా పాస్ అయ్యారు? జట్టు ఓడిపోయి.. నాయకుడు మాత్రమే గెలిచిన విచిత్రం ఎక్కడైనా ఉంటుందా? కానీ జగన్ మాత్రం వైసీపీలో ఉందంటున్నారు. తానొక్కడినే గెలిచి.. మిగిలిన ఎమ్మెల్యేలంతా ఓడిపోయారని చెబుతున్నారు. అసలు నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు చేయగలిగేదేముంది? రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలోనూ ఒకటే నీతి.. ఒకటే రీతి. ఏ నియోజకవర్గంలోనైనా సరే.. చీమ చిటుక్కు మనాలన్నా జగన్ అనుమతి తప్పని సరి అన్న పరిస్థితి ఉంటుంది.వైసీపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలలో అయితే పరిస్థితి మరీ ఘోరం. ప్రభుత్వ పరంగా ఈ మూడేళ్లలో జరిగిన పనులు శూన్యం. ఎమ్మెల్యేలు బిల్లులు వస్తాయి కదా అని తమ సొంత పలుకుబడితో చేయించిన పనుల బిల్లులే కోట్లాది రూపాయలు పేరుకుపోయి ఉన్నాయి. ఆ బిల్లులు రాకపోవడంతో స్థానికంగా వారి పలుకుబడీ పలుచబడిపోయింది.ఇప్పుడు మూడేళ్ల తరువాత ఆ బిల్లులకు మోక్షం ఎప్పుడో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలుంటూ... మీకు పాస్ మార్కులు రాలేదు, జాగ్రత్తగా ఉండకపోతే, ప్రజా మద్దతు పొందక పోతే టికెట్లు ఉండవు అంటు హెచ్చరించడంతో వారి పరిస్థితి మింగలేకా..కక్కలేకా అన్నట్లుగా తయారైంది. నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా జరిగే ఏ కార్యక్రమంతో ఎమ్మెల్యేలకు సంబంధం ఉండదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వారి ప్రమేయం ఉండదు. అంతా జగన్ మయం...జగన్ బొమ్మ పెట్టుకుని హడావుడి చేసేది వాలంటీర్లు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా..నిధులు, విధులు లేకుండా..అధికారాలన్నీ అధినేత వద్ద కేంద్రీకృతం చేసుకుని ఎమ్మెల్యేలపై జనంలో అసంతృప్తి అంటూ హెచ్చరికలు జారీ చేస్తుండటం పట్ల ఎమ్మెల్యేలలో తీవ్ర అసంతృప్తి వ్యక్త మౌతున్నది. తమకు ఏమైనా పనులు కావాలన్నా వాలంటీర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రుణఘోషతో ఏపీ

విజయవాడ, ఏప్రిల్ 29, ఏపీ అప్పులపై కేంద్రం సీరియస్ గా ఉంది. నిబంధనలను ఖాతరు చేయకుండా ఇష్టారీతిన అప్పులు చేయడమే కాకుండా.. వాటి వ్యయానికి సంబంధించి కేంద్రానికి పంపిన నివేదిక తప్పుల తడకగా ఉండటంతో.. ఏపీ నివేదికలు వెనక్కు పంపడమే కాకుండా.. కొత్త అప్పులు కావాలంటూ వచ్చిన ఏపీ ఆర్థిక కార్యదర్శికి కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు వీర లెవెల్లో క్లాస్ పీకినట్లు సమాచారం. అంతే కాకుండా చేసిన అప్పులకు సంబంధించి రాష్ట్రం సమర్పించిన నివేదినకు వెనక్కు పంపి...తాము కోరిన వివరాలను పొందుపరుస్తూ సమగ్ర సమాచారంతో తమ ఎదుట హాజరు కావాలంటూ రాష్ట్ర ఆర్థిక శాఖను కేంద్ర అధికారలు ఆదేశించారు. ఏపీ ఆర్థిక తీరుతెన్నులపై కేంద్రం సీరియస్ నెస్ చూస్తుంటే రాష్ట్రానికి కొత్త అప్పులు పుట్టే అవకాశం దాదాపు మృగ్యమనే అభిప్రాయం ఆర్థిక రంగ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు రాష్ట్ర జీఎస్డీపీలో 3.5 శాతం మాత్రమే రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఏపీ ప్రభుత్వం గతంలో అర్హతకు మించి రుణం తీసుకోవడంతో వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఆ మేరకు రుణం తీసుకునే మొత్తంలో మినహాయింపు అనివార్యమని కేంద్ర ఆర్థిక శాఖ తేల్చేసిందని చెబుతున్నారు. ఏపీ రుణాల సమీకరణకు సంబంధించి మొత్తం సమాచారాన్ని ఇందుకే కేంద్రం కోరింది. ఈ పరిస్థితుల్లోనే కేంద్రం అధికారులు క్లాస్ పీకడంతో.. ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి, అటు కేంద్రం ఆగ్రహం నేపథ్యంలో ఏపీ ఆర్థిక కార్యదర్శి సెలవుపై వెళ్లారని చెబుతున్నారు. ఏపీ ఆర్థిక కార్యదర్శి రావత్ సెలవుపై వెళ్లడంతో ఇప్పుడు కేంద్ర కోరిన వివరాలను తయారు చేయడంలో కన్సెల్టెంట్లను రంగంలోనికి దింపిన ఏపీ సర్కార్, ఆర్థిక శాఖకు చెందిన మరో ముఖ్య అధికారికి పర్యవేక్షణ బాధ్యతను అప్ప గించింది. కాగా ఇప్పటికే ఏపీ ఆర్థిక పరిస్థితి, రుణ సమీకరణలపై ఒక అభిప్రాయానికి వచ్చిన కేంద్ర వ్యయ విభాగం.. ఏపీ నుంచి సమగ్ర వివరాలు అందకపోవచ్చుననే నిర్ణయానికి వచ్చేసినట్లు సమాచారం. అందుకే అవసరమైన సమాచారాన్ని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సేకరించేందుకు రంగం సిద్ధం చేసిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం రాష్ట్రానికి కొత్త అప్పులకు అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు

# పవన్ సినిమాపైనే పగ...

ఏలూరు, ఏప్రిల్ 29,సినిమా విడుదలవుతోంది అంటే టికెట్ల ధరల విషయంలో కొద్ది రోజుల వరకు చర్చ జరిగింది. సినిమా టికెట్ల ధరల్లో వచ్చిన మార్పులు మరోసారి వివాదంగా మారింది. సినిమా టికెట్ల ధరల విషయంలో ఒక్కో హీరోకు ఒక్కోలా అనుమతించడం జగన్ సర్కార్ పై దూమరం రేపుతోంది. సినిమా టికెట్ ధరలను నిర్ధారిస్తూ జారీ చేసిన జీవో నెం 13 ప్రకారం సినిమా రేట్లు మొదటి 10 రోజులకు పెంచుకోవచ్చని మార్చి 7న ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. మెగాస్టార్ చిరంజీవి రామ్‌చరణ్ కలిసి నటించిన ఆచార్య సినిమాకు టికెట్ల రేట్లు పెంచుకునే అవకాశాన్ని కల్పించింది. విడుదలైన రోజు నుంచి పది రోజులపాటు టికెట్ రేట్లు పెంచుకునే అనుమతి ఇచ్చింది. సినిమా బడ్జెట్ ఎక్కువ కావడంతో ఆచార్య టీమ్ రిక్వెస్ట్ మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే జీవోను ముందే తీసుకురావాల్సి ఉండగా తీసుకురాలేదు. దీన్నిబట్టి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నటించిన బీమ్లా నాయక్‌ను ఏపీ సీఎం జగన్ అడ్డంగా బుక్ చేశాడని అర్థం అవుతోంది.ఈ సినిమాకు తరువాత వచ్చిన రాధేశ్యామ్, ట్రిపుల్ ఆర్ ,ఆచార్య సినిమాలకు టికెట్ రెట్లను పెంచుకునేందుకు అనుమతి ఇచ్చారు. రాజకీయ పగను సినిమాల విడుదల రూపంలో తీర్చుకోవడం ఏమిటంటూ నిలదీస్తున్నారు. ట్రిపుల్ ఆర్ సినిమాకు రూ.500 వరకు టికెట్ ధరను అమ్ముకున్న పభుత్వం పట్టించుకోలేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. బీమ్లా నాయక్ సినిమాకు మాత్రం సినిమా హాల్ ఎదుట పోలీసులు బందోబస్తు ఉంచి బ్లాక్ టికెట్లను అరికట్టినప్పుడు ట్రిపుల్ ఆర్‌కు ఎందుకు అలా చేయలేదంటూ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఏళ్ల నుంచి పాతుకుపోయారు

శ్రీకాకుళం, ఏప్రిల్ 29,సమగ్రశిక్ష అభియాన్ జిల్లా కార్యాలయంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్(ఎఫ్ఏఓ)గా ఓ వ్యక్తి 14 ఏళ్లుదాటి పనిచేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఒకే పోస్టులో ఇన్నేళ్లపాటు రిలీవింగ్, బదిలీ ఉత్తర్వులు లేకుండా పనిచేస్తున్న ఉదంతంపై కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వెంటనే సంబంధిత ఎఫ్ఏఓ పోస్టుకు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేయాలని సమగ్రశిక్ష అధికారులకు ఆదేశించినట్లు సమాచారం. ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కవిటి మోహనరావు మాతృశాఖ ఖజానా శాఖ. సంబంధిత మాతృశాఖ నుంచి రిలీవింగ్ ఆర్డర్ లేకుండా, సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టరేట్ నుంచి బదిలీ ఉత్తర్వులు లేకుండా 2008లో అప్పటి రాజీవ్ విద్యామిషన్ (ప్రస్తుతం సమగ్రశిక్షగా పేరు మార్చారు)లో అకౌంటెంట్‌గా విధుల్లో చేరారు. 8 ఏళ్లు పనిచేసిన తర్వాత అదే శాఖలో 2015 డిసెంబర్ 23 నుంచి ఇప్పటి వరకు ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల వ్యక్తిగత అవసరాల కోసం సెలవులు మంజూరు చేయమని ఏపీసీ జయప్రకాష్‌ను కోరడంతో రచ్చ మొదలైనట్టు తెలుస్తోంది. అన్ని రోజులు కుదరదని, ఖజానాశాఖ నుంచి రిలీవింగ్ లెటర్ చూపించాలని, లేదా స్టేట్ సమగ్రశిక్ష ఆఫీస్ నుంచి బదిలీ ఉత్తర్వులైనా చూపించాలని కోరగా, అవేవీ తన వద్ద లేవని మోహనరావు బదులివ్వడంతో ఇదే విషయమై ఉన్నతాధికారులకు ఏపీసీ నివేదించినట్లు తెలిసింది. ఈ ఉదంతంపై కలెక్టర్‌తోపాటు స్టేట్ సమగ్రశిక్ష ఎస్‌పీడీ వెట్రిసెల్వీ ఆరా తీసి ఫైల్ సిద్ధంచేయాలని సూచించినట్టు సమాచారం. మరోవైపు సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ శాఖాపరంగా తీసుకున్న కార్యాలయం మార్పు, నిర్ణీత గడువుకు ముందే సెక్టోరియల్ అధికారుల తొలగింపు, కొత్త నోటిఫికేషన్ తదితర నిర్ణయాలను తప్పుపడుతూ ఎఫ్ఏవో సైతం ఏపీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ రెండు ఉదంతాలపై పూర్తి నివేదిక అందజేయాలని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. విచారణాధికారిగా సైతం నియమించారు.

# ప్రసూతి సేవలకు పిపి యూనిట్ వైద్యులు

మదనపల్లె అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నందు గర్భవతులకు, బాలింతలకు వైద్య సేవలు అందించే సమయంలో ఇబ్బంది కలగకుండా పిపి యూనిట్ డాక్టర్లను అనుసంధానం చేయడం జరిగిందని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ నందు పిపి యూనిట్ డాక్టర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎమ్వో దివాకర్, పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్లు అనుపమ, గంగాదేవి, కార్యాలయ సూపరింటెండెంట్ ఫణిభూషణ్ ఉన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు గర్భవతులకు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వారికి అసౌకర్యం కలగకుండా పిపి యూనిట్ డాక్టర్ల సేవలను వినియోగించు కోవడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

# కాళహస్తితో ఎస్పీ పర్యటన

శ్రీకాళహస్తి నూతన జిల్లాగా ఏర్పడిన తిరుపతికి ఎస్పీగా రావడం ఆనందంగా ఉందని, శ్రీకాళహస్తి పట్టణం ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడికి భక్తులు అనేక మంది వస్తూ ఉంటారని వారి భద్రత దృష్ట్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తిరుపతి ఎస్పీ పరమేశ్వర రెడ్డి తెలిపారు. నేడు ఆయన శ్రీకాళహస్తి పోలీస్‌స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని పోలీసులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ శ్రీనివాసులు, ఎస్సైలు సంజీవ్ కుమార్, వెంకటసుబ్బయ్య, ట్రాఫిక్ ఏ ఎస్ఐ రియాజ్ బాష పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రి స్థాయికి పుంగనూరు కమ్యూనిటీ ఆసుపత్రి

పుంగనూరు పుంగనూరు కమ్యూనిటీ ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రి స్థాయికి అప్ గ్రేడ్ చేసే అంశమై ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. నేడు చిత్తూరు జిల్లా పుంగనూరు కమ్యూనిటీ ఆసుపత్రిలో యోగదా సత్సంగ్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి సహకారంతో ఏర్పాటు చేసిన హై డిపన్డెన్సి పీడియాట్రిక్ వార్డును పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య శాఖ నందు త్వరలో 38 వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా పుంగనూరు చెరువు సుందరీకరణకు కోటి రూపాయలతో ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు.

## పెరిగిపోతున్న కరోనా కేసుల సంఖ్య.. అధికారుల్లో టెన్షన్

హైదరాబాద్ ఏప్రిల్ 29 తాజాగా పెరిగిపోతున్న కరోనా కేసుల సంఖ్యపై అధికారుల్లో టెన్షన్ పెరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 కేసులు నమోదవుతోంది. ఈ సంఖ్య జూన్ నాటికి 3వేల కేసులకు చేరుకునే అవకాశముందని అధికారులు ఆందోళన పడుతున్నారు. దీన్ని నాలుగోదశగా భావించవచ్చని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా వైరస్ తీవ్రతను పసిగట్టి ముందుగానే నియంత్రించే విషయంలో ఉన్నతాధికారులు ఆలోచనలు చేస్తున్నారు. ఢిల్లీ మహారాష్ట్రలో కేసుల తీవ్రత పెరుగుతున్నట్లే తెలంగాణాలో కూడా మొదలైంది. అనేక రకాలుగా తెలంగాణా–మహారాష్ట్ర మధ్య సంబంధాలున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల మధ్య ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాల మీదుగా రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. బహుశా ఈ జిల్లాల నుండే తెలంగాణా అంతా వైరస్ వ్యాపించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. దీనికి అదనంగా ఓల్డ్ సిటీ నుండి కూడా వైరస్ వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన పడుతున్నారు. గతంలో కూడా ఓల్డ్ సిటి నుండే ఎక్కువ కేసులు నమోదైన విషయాన్ని అధికారులు విశ్లేషిస్తున్నారు. అందుకనే ముందు జాగ్రత్తగా తెలంగాణా వ్యాప్తంగా మళ్ళీ మాస్కులు ధరించటాన్ని కంపల్సరీ చేసే విషయమై ఉన్నతాధికారులు ప్రభుత్వంతో మాట్లాడుతున్నారు. ఇప్పటికే ఢిల్లీలో మాస్కులు తప్పనిసరి చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ముందుగా మేల్కొనకపోతే తెలంగాణలో పరిస్థితులు చేయిదాటిపోయినా ఆశ్చర్యంలేదని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారట. పైగా చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గతంలోలాగా ఇపుడు కరోనా వైరస్ వ్యాక్సినేషన్ వేయడం లేదు. బూస్టర్ డోసును ప్రైవేటు ఆసుపత్రుల్లో వేయించుకోమని చాలా మందికి ఉచిత సలహా కూడా ఇస్తున్నారు. కరోనా వైరస్ తీవ్రతకు సంబంధించి తెలంగాణ వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల్లో టెన్షన్ పెరిగిపోతోంది.

# సమ్మర్...వాహనాదారులు జాగ్రత్త

రాజమండ్రి, ఏప్రిల్ 29,భానుడు నిప్పులు కక్కుతున్నాడు. సూర్యుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తుతున్నారు. బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఇక మిట్ట మధ్యాహ్నం వేళయితే చెప్పాల్సిన అవసరమే లేదు. ఎండలో కాలు పెడితే చాలు ఒంట్లోని సత్తువంతా ఆవిరైపోతోంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం మనం ఎలా జాగ్రత్తలు పాటిస్తామో.. వాహనాలను కూడా అలానే కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. వాహనాలు ఎండలో గంటల సమయం ఉంచడం వల్ల రంగు వెలిసిపోతాయని, పెట్రోల్ ఆవిరయ్యే అవకాశం ఉంటుందని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. వాహనాలకు ట్యాంక్ నిండా పెట్రోల్ పట్టిస్తే ఒక్కో సారి పేలే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు.

కార్లు, లారీలు ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీళ్లను తరచూ తనిఖీ చేసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ఇంజిన్ ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉంది.

రేడియేటర్లలో నీళ్లకంటే కూలెంట్ ఆయిల్ వాడడం మంచిది.

వేడికి ఇంజిన్ ఆయిల్ తగ్గే అవకాశాలు ఉంటాయి. తప్పనిసరిగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి.

పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా వాహనాలు నడిపేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అటువంటి వాహనదారులు వేసవిలో గ్యాస్ కిట్‌ను ఉపయోగించకుండా ఉంటే ఉత్తమం.

ఏసీ నిలబడాలంటే కారు అద్దాలకు క్లాత్ మ్యాట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

ఎండాకాలం పూర్తయ్యే వరకు భారీ వాహనాలకు నూతన టైర్లు వాడితే మేలు. లేదంటే దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పాత టైర్లలో గాలి తగ్గిపోయి పేలిపోయే ప్రమాదం ఉంది.

ద్విచక్ర వాహనాలకు రక్షణ ఇలా..

వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే.. చెట్టు నీడన గానీ, షెడ్లలో గానీ లేదా కవర్లు కప్పి ఉంచాలి.

అధిక ఉష్ణోగ్రతల వల్ల టైర్లలో గాలి తగ్గిపోతుంది. తరచూ గాలి తనిఖీ చేయించుకోవడం మంచిది.

బైక్‌లు ఎక్కువ సమయం ఎండలో ఉంచితే పెట్రోల్ ఆవిరి అయిపోయే అవకాశం ఉంటుంది.

పెట్రోల్ ట్యాంకుపై మందపాటి కవర్ ఉండేటట్లు చూసుకోవడం వల్ల కొంత మేర పెట్రోల్ ఆవిరి కాకుండా చూడవచ్చు.

ఎండల వేడికి ఇంజిన్ ఆయిల్ త్వరగా పల్చబడిపోతుంది. నిర్ణీత సమయానికి ఇంజిన్ ఆయిల్ మార్చుకోవడం మంచిది.

వేసవి కాలంలో పెట్రోల్ ట్యాంకులో గ్యాస్ ఏర్పడే అవకాశం ఉంటుంది. రాత్రి సమయంలో బైక్‌ను పార్క్ చేసేటప్పుడు ఒకసారి ట్యాంక్ మూతను తెరచి మూయాలి.

గాలి పట్టే విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే టైర్ల మన్నిక తగ్గిపోతుంది. తద్వారా పెట్రోల్ ఎక్కువ ఖర్చయ్యే ప్రమాదం ఉంది.

వేసవి కాలంలో ద్విచక్ర వాహనాలపై దూర ప్రయాణం చేయడం తగ్గించుకుంటే మేలు. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాల వేగానికి, ఉష్ణోగ్రతల వేడికి ఇంజిన్ రెండింతలు వేడెక్కే అవకాశం ఉంటుంది. అందుకోసం కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజిన్ కాసేపు ఆపుకుంటే వాహనం మన్నిక కాలం పెరుగుతుంది. నిర్ణీత గడువులోపు ఇంజిన్ ఆయిల్ చెక్ చేసుకోవాలి. ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బైక్‌లకు ఫుల్ ట్యాంక్ చేయించడం వల్ల పేలిపోయే ప్రమాదం ఉంది. రెండు లీటర్లు పెట్రోల్ వరకు వేయించుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. ఒక వేళ బైక్ ఎండలో పెట్టాల్సిన అవసరం ఏర్పడితే ఏదైనా పొడవాటి క్లాత్‌ను ట్యాంక్‌పై కప్పి ఉంచితే సరిపోతుంది. లేదంటే ఎండలకు ఆయిల్ ట్యాంకర్ హీటెక్కి పేలిపోయే ప్రమాదం ఉంది.

# సున్న వడ్డీ పథకం ద్వారా అక్క చెల్లెమ్మలు ఆర్థికంగా అభివృద్ధి...

**శిల్పా రవి రెడ్డి**


గోస్పాడు ఏప్రిల్ 29 నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలో వైయస్ఆర్ సున్నా వడ్డీ పథకం ద్వారా మహిళలకు కోటి అరవై లక్షల రూపాయలు వారి అకౌంట్లలో జమ చేయడం జరిగింది. అలాగే గ్రామ వార్డు వాలంటీర్లకు సేవా మిత్ర సేవ రత్న సేవా వజ్ర అవార్డులను నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు...ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలో వైయస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా కోటి 60 లక్ష రూపాయలు అక్కా చెల్లెమ్మ ల బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరిగిందని గతంలో తెలుగుదేశం నాయకులు మహిళలకు రుణ మాఫీ చేస్తామని చెప్పి ఎలక్షన్ సమయంలో ఓట్ల కోసం పసుపు కుంకుమ కార్యక్రమం అని చెప్పి మహిళను మోసం చేసిన ఘనత చంద్రబాబు ది కానీ ప్రజా సంకల్ప యాత్రలో అక్కాచెల్లెళ్ల పడుతున్న ఆర్థిక ఇబ్బందులను చూసిమన రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న చలించిపోయి వారి ఉజ్వల భవిష్యత్తు కోసం వై.యస్.ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించి నవరత్నాలలో చేర్చడం జరిగింది. నేడు మహిళల కోసం జగనన్న వారి అకౌంట్ హాలో అమౌంట్ జమ చేయడం తెలుగుదేశం నాయకులు జీర్ణించు కోలేక కడుపు మంటతో పగిలి పోతున్నారని దేశంలో ఏ రాష్ట్రంలో చేయని ఈ విధంగా నవరత్నాలు ప్రతి పేదవాడికి న్యాయం జరగాలని తపించి పోతున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు అనంతరం గ్రామ వార్డు సచివాలయం ద్వారా ఏర్పాటుచేసిన వార్డు వాలంటరీ లు చేస్తున్న సేవలకు సేవా మిత్ర- సేవ రత్న- సేవ వజ్ర అవార్డులను ఇచ్చి సత్కరించడం జరిగింది అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళలు నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.

# ఆంగ్ల పరీక్ష పేపర్ బహిర్గతం..

.నందికొట్కూరు పట్టణంలోని గాంధీ మెమోరియల్ పాఠశాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పరీక్ష ప్రారంభమైన గంట వ్యవధిలోనే అక్కడ పనిచేసే సిబ్బంది ద్వారా పరీక్ష పత్రం లీక్ అయిందని. ఒక వ్యక్తి సెల్ఫోన్ ద్వారా ఇంగ్లీష్ పేపర్ -1 పరీక్ష పత్రం వాట్సప్ ద్వారా బయట వ్యక్తులకు చేరవేయడంతో అవి పలు గ్రూపులలో వెళ్లి హల్చల్ అయినట్టు తెలుస్తోంది . గాంధీ మెమోరియల్ పాఠశాలలో 12 సెంటర్లో, 12 ఇన్విజిలేటర్,274 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. సమాచారం తెలుసుకున్న డీఈవో రంగారెడ్డి, మరియు పట్టణ రూరల్ సిఐలు నాగరాజారావు, ప్రసాదులు పరీక్షా కేంద్రానికి హుటాహుటిన చేరుకొని విచారణ జరిపారు. పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుని సూపర్వైజర్ ను విచారించి చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు. ప్రశ్నాపత్రం లీకేజీ పై పట్టణంలో ఉన్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం. తమ సొంత ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా పాత్ర పాత్ర ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకుని 10వ తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థిని విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్న అనంతరం ఇలాంటి తప్పుడు నివేదికలతో విద్యార్థిని విద్యార్థులు జీవితాలతో చెలగాటం ఆడటం ఇది మంచి పద్ధతి కాదు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల యజమానులు తమ వంకరబుద్ధి మానుకొని ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు ఏ విధంగా చర్యలు తీసుకోవాలి ఊరు గొప్ప.. పేరు దిబ్బ...అన్నన చందంగాడి వ్యవహరించడం సిగ్గుమాలిన చర్య అని విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.. గాంధీ మెమోరియల్ పరీక్ష సెంటర్లో పరీక్షలు రాసే తమ పిల్లలు కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం మా పిల్లల భవిష్యత్తును బజార్ సరైన పద్ధతి కాదని వారు హెచ్చరించారు.. ఏదైనా తప్పులు జరిగితే మీరు మీరు చూసుకోండి కానీ విద్యార్థిని విద్యార్థుల మీద చూపించడం సరైన పద్ధతి కాదని వారు తెలియజేశారు.డీ ఈ ఓ తో పాటు తాసిల్దార్ రాజశేఖర్ బాబు, ఎస్సైలు మారుతి శంకర్, వెంకటరమణ,తదితరులు ఉన్నారు.

# ముస్లింలకు రంజాన్ తోఫా అందజేసిన టిడిపి నాయకులు

నెల్లూరు పవిత్ర రంజాన్ మాసంలో 32 వ డివిజన్ పరిధిలోని పేద ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫా అందజేశారు . ఈ కార్యక్రమం నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని 32 వ డివిజన్ లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు , గ్రామీణ నియోజకవర్గ ఇన్చార్జి షేక్ అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రివర్యులు తాళ్లపాక రమేష్ రెడ్డి ఆయన సతీమణి టిడిపి రాష్ట్ర మహిళ నాయకురాలు తాళ్ళపాక



అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాళ్లపాక దంపతులు మాట్లాడుతూ టిడిపి హయాంలోనే ముస్లింల అభివృద్ధి సంక్షేమ జరిగిందన్నారు. రాష్ట్రంలో గత 3 సంవత్సరాలుగా అభివృద్ధి సంక్షేమం కొరవడిందన్నారు . జగన్ పాలనలో చెత్త పన్ను తో పాటు నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోలియం ధరలతో బాదుడే బాదుడన్నారు. ప్రజా నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర పాలనకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పాలనలోకి వచ్చిన గడచిన3 సంవత్సరాలలో అభివృద్ధి సంక్షేమం శూన్యమన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో ముస్లింలకు ఇస్తున్న పథకాలను రెట్టింపు చేస్తానన్న వైయస్ జగన్ పూర్తిగా విస్మరించడం తగదన్నారు. ముస్లింలకు పరమ పవిత్రమైన రంజాన్ మాసంలో రంజాన్ తోఫా కూడా ఇవ్వలేని అదనపు పరిపాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు వైకాపా పరిపాలన తీరు చూసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు నూతన పరిపాలనకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నెల్లూరు గ్రామీణంలో అందినకాడికి దోచుకో దోచుకున్న దోచుకో అన్న విధంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి వ్యవహార తీరు జోరుగా సాగుతున్న అన్నారు. ఇప్పటికైనా ప్రజలు సరైన నిర్ణయం తీసుకొని ఓటు అనే ఆయుధంతో తెలుగుదేశం పాలనకు స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి 32 వ డివిజన్ టిడిపి అధ్యక్షులు తోట సునీల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైననావూరు శైలేంద్ర బాబుకు ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమం స్థానిక 32 వ డివిజన్ టిడిపి అధ్యక్షులు తోట సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శైలేంద్ర బాబు మాట్లాడుతూ అధికారిక రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన రంజాన్ తోఫాను ప్రతిపక్ష నేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సూచనలు సలహాల మేరకు రంజాన్ తోఫాను పంపిణీ చేయడం జరిగిందన్నారు. టిడిపి హయాంలో పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి సంవత్సరం ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం జరిగిందని, గత మూడు సంవత్సరాలుగా అధికారిగా పాలన చేపడుతున్న జగన్ ప్రభుత్వం ముస్లింలకు రంజాన్ తోఫా అందు చేయలేకపోవడం సిగ్గుచేటన్నారు. రానున్న 2024లో జరుగు సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడిని తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చూడాలన్నదే నా ఆశయం అన్నారు. ఈ కార్యక్రమంలో 32 వ డివిజన్ టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# యూత్ అసోసియేషన్ రంజాన్ తోఫా పంపిణీ

గూడూరు ప్రతి ఒక్క ముస్లిం కుటుంబం రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఈద్గా యూత్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ముస్లిం సంక్షేమ సంఘం నాయకుడు మగ్దూం మొహియుద్దీన్ కొనియాడారు . గూడూరు పట్టణంలోని దర్గాలో పేద ముస్లిం కుటుంబాలకు ఈద్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పలు ముస్లిం సంఘాలకు చెందిన నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు

గూడూరు పట్టణ పరిధిలోని దర్గా వీధి లో ఉన్న దర్గాలో ఈద్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు వందల పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం సంక్షేమ సంఘం నాయకుడు మగ్దూం మొహియుద్దీన్ మాట్లాడుతూ ఈద్గా యూత్ అసోసియేషన్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి అని కొనియాడారు . ప్రముఖంగా కరోనా వైరస్ ఉన్న తరుణంలో యూత్ అసోసియేషన్ అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు . గత నాలుగు సంవత్సరాలుగా పేద కుటుంబాలను గుర్తించి రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకునేందుకు 14 వస్తువులతో కూడిన రంజాన్ తోఫా అందజేస్తూ స్ఫూర్తిదాయక నిలుస్తున్నారని ప్రశంసించారు . భవిష్యత్తులో కూడా యూత్ అసోసియేషన్ ప్రజా ప్రయోజనకరమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు .

# అంబులెన్స్ సిబ్బందిని హెచ్చరించిన డిఎస్పీ

మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి పేదల్లో పేదలు వెళ్తారని, అటువంటి వారి నుండి అంబులెన్స్ సిబ్బంది అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా మదనపల్లె డిఎస్పీ రవిమనోహరాచారి హెచ్చరించారు. ఇటీవల రుయా ఆసుపత్రి లో జరిగిన సంఘటన అమానవీయమైనదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు మదనపల్లె నందు జరగకుండా చర్యలు చేపట్టామని, ఏ ఆంబులెన్స్ డ్రైవర్ అయినా రోగులను డబ్బుల కోసం వేధిస్తే డెయిల్ 100 లేదా 9440796738 డిఎస్పీ, లేదా దగ్గరలోని పోలీస్టేషనుకు ఫోన్ చేయాలని సూచించారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని రోగులకు భరోసా ఇచ్చారు.

# రమ్య హత్యకేసులో నిందితుడు శశికృష్ణకి మరణశిక్ష

గుంటూరు బీటెక్ విద్యార్థిని రమ్య హత్యకేసులో నిందితుడు శశికృష్ణకి మరణశిక్ష ఖరారయింది. ఈ మేరకు శుక్రవారం నాడు 4వ ప్రత్యేక న్యాయమూర్తి రాంగోపాల్ తీర్పు వెలువరించారు. అయితే నిందితుడికి హైకోర్టులో అఫీల్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. సోషల్ మీడియా ద్వారా రమ్యకు పరిచయమైన శశికృష్ణ తర్వాత క్రమంలో తన నెంబర్ బ్లాక్ చేసిందనే కారణంతో కక్షపెంచుకున్నాడు. చివరకు గత ఏడాది ఆగష్టు 15న గుంటూరు జిల్లా పరమయ్యకుంటలో రమ్యను హత్య చేశాడు. పోలీసులు శశికృష్ణను 24 గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. గత యేడాది డిసెంబర్లో కోర్టులో విచారణ ప్రారంభమైంది. ఈనెల 26న ముగిసింది. 8 నెలల పాటు కేసు విచారణ సాగింది. మొత్తం 28 మంది సాక్షులను న్యాయస్దానం విచారించింది. శుక్రవారం నాడు తీర్పును వెలువరించారు. ఈ తీర్పు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రింది కోర్ట్ అన్ని విధాలా విచారించి ఇలాంటి దారుణ కేసులో విధించిన ఉరిశిక్ష తిరుగులేనిదని,ఇది మృగాలకి వణుకు పుట్టేలా ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు. శిక్ష పడిన నిందితుడు పైకోర్టులను ఆశ్రయించినప్పటికి ఈ శిక్షలో మరో మార్పు వుండే అవకాశాలు లేవని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు.

# జనసేన నిరసన

విశాఖపట్నం పెంచిన విద్యుత్ ఛార్జీలు, అప్రకటిత కరెంటు కోతలను నిరసిస్తూ విశాఖలో జనసేన పార్టీ వినూత్న నిరసన చేపట్టిం ది. గురుద్వారా జంక్షన్ నుంచి ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వరకు చీపుర్లతో రోడ్డు ఊడుస్తూ నిరసన తెలియజేశారు. అనంతరం విద్యుత్ చార్జీలు తగ్గించాలని, కరెంటు కోతలు విధించ వద్దని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ కు వినతి పత్రం సమర్పించా రు. ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉషా కిరణ్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వలన రాష్ట్రం విద్యుత్ సంక్షోభానికి గురైందని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు వలన రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలపై 42 వేల కోట్ల భారం పడిందని పేర్కొన్నారు. దీనిబట్టి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని వెల్లడించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారము లోకి రాక ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి... అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు జనసేన పార్టీ ఉద్యమం కొనసాగిస్తుందని అన్నారు.

# బీడీ కార్మికులకు కరువు భత్యం పెంపు

**బీడి కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు**

కోరుట్ల ఏప్రిల్ 29 బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం ఈ నెల ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని బీడీ కార్మిక సంఘం.ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు బీడీ పరిశ్రమ యాజమాన్యలను డిమాండ్ చేశారు.బీడీ కార్మికుల పోరాటాల ఫలితంగా 1994 లో ఏప్రిల్ నెల1నుండి కరువు భత్యం ఏడాది కి ఒకసారి అమల్లోకి వచ్చిందని రాములు అన్నారు.వినిమయ ధరల సూచిక ప్రకారం 2021 జనవరి నుంచి డిసెంబర్ 2021 వరకు 1548 నుండి 1602 వరకు అనగా 54 విడిఏ పాయింట్లు పెరిగిందన్నారు.బీడీ నెలసరి ఉద్యోగాలకు చాటన్ వాల, ప్యాకింగ్ కార్మికులకు 1000 బీడిలకు రూపాయలు 217.75 పైసలకు పెరిగిందని పేర్కొన్నారు..ఈ పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ 1 నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాల మరియు పీఎఫ్ , నాన్ పీఎఫ్ కార్మికులకు కూడా వర్తిస్తుందని రాములు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నేతలు చెన్న విశ్వనాధం,ఎండి.ముక్రం, ఎం. రాధ, రామిల్ల రాం బాబు,సాంబార్ మహేష్, కొక్కు ల శాంత,అందెరామయ్య, మ్యాదరి గణేష్ తేలు రవి,ఎస్.కె చాంద్ పాషా,మునుగురి హనుమంతు, రాధ, లక్ష్మీ, సుశీల పాల్గొన్నారు.

# మండుటెండలో పరీక్షలా

## విద్యార్థుల సమస్యలు పాటించుకొని ప్రభుత్వం

గద్వాల ఏప్రిల్ 29 :- జోగులాంబ గద్వాల జిల్లా బహుజన సమాజ్ పార్టీ ఇంచార్జ్ కేశవ రావు, అలంపూర్ నియోజకవర్గం అధ్యక్షులు బోరెలి మహేష్ , విద్యార్థులు మాట్లాడుతూవిద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ×చెలగాటమాడుతోందని మండుటెండలు ఉన్నటువంటి మే (24/05/2022 నుంచి (04/06/2022) తేదిలలో పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు×వడదెబ్బకు గురై× ×అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉ ందని వేసవి సమయంలో పరీక్షలు నిర్వహిస్తే వాటి×ఫలితాలు ఎప్పుడు రావాలి× వారు ×ఇంటర్మీడియట్ ఎప్పుడు అప్లై ×చేసుకోవాలి అన్నారు. తెరాస ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు పట్ల స్పష్టత లేకుండా ×నిరంకుశంగా నిర్లక్ష్యంగా× వ్యవహరిస్తోందన్నారు. అసలే ×వేసవి కాలం ప్రజలు బయటకు రావాలంటేనే ఇబ్బంది ×పడుతున్న ఇటువంటి తరుణంలో విద్యార్థులు వారితో పాటు తల్లిదండ్రులు పరీక్ష హాల్ దగ్గరికి హాజరు కావడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఇష్టం వచ్చినట్లుగా పరీక్షలు నిర్వహిస్తున్న ఈ ప్రభుత్వాన్ని కి చిత్తశుద్ధి లేకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది ×విద్యార్థులకు , తల్లీదండ్రులకు బస్సు సౌకర్యం కల్పించాలని,× స్కూల్ ఆవరణలో×టెంట్స్, త్రాగు నీరు ఉండేటట్లు చూడాలని× ఒక్క రోజు ×బయోసైన్స్ ఫిజిక్స్ ఎలా× వ్రాస్తామని ఆవేదన వ్యక్త పరిచారు విద్యార్థుల ×భవిష్యత్తును ఆటంకం×కలిగించే ఎవరినైనా సరే ఎదుర్కోవడానికి బహుజన సమాజ్ పార్టీ తరపున సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా ఇంఛార్జి కేశవ రావు , నియోజకవర్గ ఇంచార్జి కనకం బాబు , నియోజక వర్గ అధ్యక్షులు మహేష్ , ఉపాధ్యక్షులు యామిని సుంకన్న , సెక్టార్ అధ్యక్షులు శివ శంకర్ , రాజు , ఃఐఈ జిల్లా కన్వీనర్ దివాకర్ , విద్యార్థులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# కర్నూలును పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుతాం :- మేయర్ బి.వై. రామయ్య




కర్నూలు ఏప్రిల్ 29 :- కర్నూలును పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుతామని కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్య పేర్కొన్నారు. క్లాప్ కార్యక్రమం గురించి ప్రజల్లో చైతన్య పరుస్తూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ 23వ వార్డు సి.క్యాంప్ రైతు బజార్ సమీపంలో ఏర్పాటు చేసిన "క్లాప్ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమానికి కర్నూలు మేయర్ బి.వై. రామయ్య , కమిషనర్ ఏ.భార్గవ్ తేజ , ఉప కమిషనర్ పద్మావతి , అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ హాజరయ్యారు. ముందుగా సానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సెక్రటరీ లతో సమావేశం నిర్వహించి అనంతరం సి.క్యాంప్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కర్నూలు నగరం పరిశుభ్రతలో 197 నుంచి 70వ ర్యాంకు

### సి.క్యాంప్ రైతు బజార్ దగ్గర "క్లాప్ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమం? హాజరైన మేయర్, కమిషనర్ ఇకపై సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారిస్తామని మేయర్ వెల్లడి

సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని రానున్న రోజుల్లో నగరాన్ని "సింగిల్ డిజిట్" గా సాధించాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని, సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ప్రతి నెల 29, 30 తేదిల్లో క్లాప్ కార్యక్రమం నిర్వహిస్తామని, క్లాప్ కార్యక్రమం ద్వారా పరిశుభ్రతపై ప్రచారాలు, ఇంటి వద్దే వ్యర్థాలను వేరు చేయుట, ఇంటి కంపోస్టింగ్, 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్నా ప్లాస్టిక్ వాడకం నిషేధం వంటి అంశాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ఊడ్చటం, డ్రైన్ క్లీనింగ్, బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచటం వంటి కార్యక్రమాలను కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది, సానిటేషన్ , మున్సిపల్ సిబ్బందితో చైతన్య కార్యక్రమాలు చేపడతామన్నారు. నగరానికి పాలకవర్గం వచ్చిన తర్వాత చేపట్టిన మొదటి కార్యక్రమం క్లీన్ సిటి మీదే అని గుర్తు చేశారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.క్లాప్ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు కటారి పల్లవి, సుదర్శన్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, లక్ష్మికాంత రెడ్డి, ఎం.హెచ్.ఓ. భాస్కర్ రెడ్డి, సానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు, ఎస్.ఈ. సురేంద్ర బాబు, డిఈఈ రసూల్, ఏఈ కృష్ణలత, ఆర్.ఐ. వాజిద్, సానిటేషన్ ఇంస్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిలా సచివాలయ వ్యవస్థ పని చేయాలన్నారు



కర్నూలు , ఏప్రిల్ 29సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కర్నూలుజిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారుశుక్రవారం కర్నూలు నగరంలోని రోజా వీధి - 1, రోజా వీధి - 2 వార్డు సచివాలయం నెం. 123 , వార్డు సచివాలయం నెం. 124లను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారుఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికలు, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించే సేవలను

### ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలి
### సచివాలయ సిబ్బందిని ఆదేశించిన కర్నూలుజిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు

గడువు లోపు అందించాలని కలెక్టర్ ఆదేశించారుఅదేవిధంగా ప్రజలకు అందుతున్న పథకాల తీరు, సమస్యల పరిష్కారానికి సిటిజన్ ఔట్ రిచ్ కార్యక్రమం కూడా జరగాలని జిల్లా కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.. మొక్కుబడిగా కాకుండా చిత్త శుద్ధితో ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఫిర్యాదులు రాకుండా జాగ్రతగా పని చేయాలన్నారు. .సచివాలయం ద్వారా రోజులో వీలైనన్ని ఎక్కువ సర్వీసులను సకాలంలో అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది తాము సక్రమంగా పని చేయడంతో పాటు తమ పరిధిలో ఉన్న వాలంటరీ వ్యవస్థ కూడా సక్రమంగా పనిచేసేలా చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారువన్టైమ్ సెటిల్మెంట్ కింద లబ్ధిదారులు అందరికీ డాక్యుమెంట్లను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డ్ లో సభ్యుల చేర్పు గురించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు

# భగవద్గీత జీవన గీత



శ్రీశైలం ఏప్రిల్ 29 :- భగవద్గీత జీవన గీత అని, మానవుడు సమస్తమైన దుఃఖాల నుండి పరమ శాంతిని, సౌఖ్యాన్ని ప్రసాదించేది ఈ సృష్టిలో శ్రీమద్భగవద్గీత మాత్రమే నని గీతా ప్రచారకులు మద్దయ్య స్వామి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సుండిపెంట లోని శ్రీ కుమార స్వామి దేవస్థానం నందు మంగళవారం నుండి మొదటి రోజు శ్రీమద్రామాయణం రెండవరోజు మహాభారతం మూడవ రోజు శ్రీమద్భగవద్గీత లపై ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జునుడిని సాకుగా చూపి యావత్ మానవలోకానికి ప్రసాదించిన అమృతపు మూడింటిని అన్నారు. సాక్షాత్తు భగవంతుని ముఖపద్మం నుండి వెలువడినది కాబట్టి గీత గంగ కంటే ఎంతో పావనమైనదని చాటారు. మనిషిగా పుట్టిన ప్రతి జీవి తెలుసుకోదగ్గ సద్గ్రంథం భగవద్గీత అని ఉద్ఘాటించారు. ముగింపు సందర్భంగా స్థానిక అర్చకులు రామశర్మ, సాయి శర్మ ఆధ్వర్యంలో భక్తులతో గోపూజ , కుంకుమార్చనలు చేయించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ఆలయ నిర్వాహకులు జగదీశ్, సుబ్రహ్మణ్యం, మధు, కోటేశ్వరరావు, ఓబులేసు, సత్యనారాయణ,తితిదే ధర్మాచార్యులు అన్నా వేణుగోపాల్ తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వెంగమాంబ ధ్యానమందిరానికి టిటిడి ఛైర్మన్ శంకుస్థాపన

### - ఈ నిర్మాణానికి రూ.5 కోట్లు విరాళం అందించిన ఎంపి

తిరుమల,తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ బృందావనంలో నిర్మించనున్న ధ్యానమందిరానికి టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి పరమ భక్తురాలు అయిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ శ్రీ అన్నమాచార్యుల తరహాలో సంకీర్తన సేవతోపాటు తిరుమలలో అన్నప్రసాద వితరణకు నాంది పలికారని తెలిపారు. తిరుమలలో చాలాకాలం పాటు ఆమె ధ్యానం చేశారని, ధ్యానం చేస్తూనే శ్రీవారిలో ఐక్యమయ్యారని చెప్పారు. రాజ్యసభ సభ్యులు శ్రీ ఎ.అయోధ్య రామిరెడ్డి అందించిన రూ.5 కోట్ల విరాళంతో 1.5 ఎకరాల విస్తీర్ణంలో 350 మంది భక్తులు కూర్చొని ధ్యానం చేసేందుకు వీలుగా అన్ని వసతులతో ఇక్కడ ధ్యానమందిరం నిర్మించనున్నట్లు వెల్లడించారు.

# అనుష్క... ఒక అంతర్జాతీయ చెఫ్

టాలీవుడ్ లో సూపర్ స్టార్ హీరోయిన్ గా వెలుగు వెలిగిన అనుష్క బాహుబలి సినిమా తర్వాత మరింత స్పీడ్ గా సినిమాలు చేస్తుందని... లేడీ ఓరియంటెడ్ సినిమాలతో లేడీ సూపర్ స్టార్ ట్యాగ్ ను దక్కించుకుంటుందని అంతా భావిస్తే అనుష్క మాత్రం సినిమాలను చాలా లైట్ తీసుకున్నట్లుగా అనిపిస్తుంది. గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఆమె నుండి భాగమతి మరియు నిశబ్దం సినిమాలు మాత్రమే వచ్చాయి.ఒక్కో సినిమాకు రెండు మూడు కోట్ల పారితోషికం తీసుకునేంత సత్తా.. క్రేజ్ ఉన్న అనుష్క అన్ని కోట్లను లైట్ తీసుకుంటున్నట్లుగా అనిపిస్తుంది. ఆమె ఎలా ఉన్నా కూడా సినిమాలను నిర్మించేందుకు పెద్ద నిర్మాతలు ఎంతో మంది క్యూ కడతారు. కాని అనుష్క మాత్రం ఆచి తూచి సినిమాను ఎంపిక చేస్తుంది. కమిట్ అయిన సినిమాలకు కూడా డేట్లు అదుగో ఇదుగో అంటూ ఆలస్యం చేస్తుందట.యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో పి మహేష్ దర్శకత్వంలో ఒక సినిమా కు అనుష్క గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ సినిమా గత ఏడాదిలోనే పట్టాలెక్కాల్సి ఉంది. స్క్రిప్ట్ వర్క్ కూడా ఎప్పుడో పూర్తి అవ్వాల్సి ఉంది. కాని అనుష్క సరిగా సమయం కేటాయించని కారణంగా ఆలస్యం అవుతూ వస్తుందట. యూవీ క్రియేషన్స్ వారికి అనుష్క తో సన్నిహిత సంబంధాలు ఉన్న కారణంగా వారు కూడా ఆమెను బలవంతం చేయడం లేదు.హీరోయిన్ గా అనుష్క ను వెండి తెరపై చూడాలని ఆమె అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమె మాత్రం గత కొన్ని రోజులుగా కుటుంబ సభ్యులతో క్వాలిటీ టైమ్ ను స్పెండ్ చేస్తూ లైఫ్ ను ఎంజాయ్ చేస్తుంది. ఎట్టకేలకు వచ్చే నెల నుండి సినిమా షూటింగ్ లో జాయిన్ అయ్యేందుకు ఓకే చెప్పిందని యూవీ క్రియేషన్స్ వర్గాల నుండి సమాచారం అందుతోంది.ఇదే సమయంలో సినిమాలోని ఆమె పాత్ర గురించి ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. సినిమాలో అనుష్క అంతర్జాతీయ స్థాయి చెఫ్ గా కనిపించబోతుందట. ఆమె పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని.. ఇప్పటి వరకు అనుష్కని చూడని విధంగా చూస్తారంటూ మేకర్స్ చెబుతున్నారు. సినిమాలో జాతిరత్నం నవీన్ పొలిశెట్టి ఉండటం వల్ల సినిమా స్థాయి మరింతగా పెరుగుతోంది.అనుష్క మరియు నవీన్ పొలిశెట్టి ల మధ్య సంబంధం సినిమాలో ఎలా ఉంటుంది అనేది తెలియాల్సి ఉంది. ఈ సినిమా షూటింగ్ ఇదే నెలలో ప్రారంభం కాబోతుంది. అనుష్క మరియు నవీన్ లేకుండా షూటింగ్ జరుగబోతుంది. వచ్చే నెలలో అనుష్క జాయిన్ అవ్వనున్నట్లుగా సమాచారం అందుతోంది. నవీన్ పొలిశెట్టి కూడా త్వరలోనే ఈ సినిమా షూటింగ్ లో జాయిన్ అవుతాడట.ఈ ఏడాది చివరి వరకు సినిమా ను ముగించాలని.. ఆ వెంటనే విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అనుష్క తో యూవీ క్రియేషన్స్ వారు నిర్మించబోతున్న ఈ సినిమా భారీ బడ్జెట్ తో రూపొందబోతున్నట్లుగా సమాచారం అందుతోంది.



# తమిళంలోకి 'సర్కారు వారి పాట'.. టైటిల్ ఇదేనా..?

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం "సర్కారు వారి పాట". పరశురామ్ పెట్లా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.'సర్కారు వారి పాట' సినిమా మే 12న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ చిత్రాన్ని తమిళ్ లో కూడా రిలీజ్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని టాక్ నడుస్తోంది. తమిళనాడులో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్ ను ఒకేసారి విడుదల చేయనున్నారని అంటున్నారు.మహేష్ బాబుకు తమిళనాడులో మంచి ఫాలోయింగ్ ఉంది. అందుకే అగ్ర హీరో నటించే సినిమాలు క్రమం తప్పకుండా తమిళంలోకి డబ్ చేస్తుంటారు. 'స్పైడర్' సినిమాతో నేరుగా కోలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన మహేష్.. 'శ్రీమంతుడు' చిత్రాన్ని డబ్బింగ్ చేసి రిలీజ్ చేశారు.మహేశ్ చివరి సినిమా 'సరిలేరు నీకెవ్వరు' ను కరోనా ఫస్ట్ వేవ్ పాండమిక్ తర్వాత "ఇవణ్ణుకు సరియానా అలిల్లై" అనే పేరుతో తమిళంలోకి అనువదించారు. తమిళనాట మహేష్ కి ఉన్న మార్కెట్ ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు "సర్కారు వారి పాట" చిత్రాన్ని డబ్బింగ్ చేసి విడుదల చేయనున్నారని తెలుస్తోంది.తమిళ్ లో ఈ చిత్రానికి తాత్కాలికంగా 'పుదియ అరసాంగం' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. దీనికి 'కొత్త ప్రభుత్వం' అనే అర్థం వస్తుంది. తమిళనాడు ఏరియాలో ప్రముఖ డిస్ట్రిబ్యూటర్లచే ఈ సినిమా విడుదల కాబోతోందని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో తెలుగు ప్రమోషన్స్ తో పాటుగా తమిళ టైటిల్ - పాటలు - ట్రైలర్ మరియు ఇతర అప్డేట్లు రానున్నాయని నెట్టింట ప్రచారం జరుగుతోంది.'భరత్ అనే నేను' 'మహర్షి' 'సరిలేరు నీకెవ్వరు' వంటి హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న మహేష్.. ఈసారి "సర్కారు వారి పాట" సినిమాతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకుంటారని అభిమానులు భావిస్తున్నారు. ఇందులో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుండగా.. సముద్ర ఖని - ప్రకాష్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమిళ రిలీజ్ కు మహేశ్ తో పాటుగా వీరు ముగ్గురూ అడ్వాంటేజ్ గా మారే అవకాశం ఉంది.'సర్కారు వారి పాట' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ - ఉఃః ఎంటర్టైన్మెంట్ మరియు 14 రీల్స్ ప్లస్ బ్యానర్లపై రూపొందిస్తున్నారు. నవీన్ యెర్నేని - వై. రవిశంకర్ - రామ్ ఆచంట - గోపీచంద్ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. ఆర్ మధి ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ అందించగా.. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ చూసుకుంటున్నారు.




# ఆకాశమే నీ హద్దు.. దీపిక క్రేజ్ కి నిదర్శనమది

కొందరికి పెళ్లయ్యాక క్రేజ్ తగ్గుతుందని అంటారు. కానీ అసలు ఈ పొడుగు కాళ్ల సుందరికి అలాంటి అడ్డంకులేవీ లేవ్. వన్నెతరగని అందాలతో అర్ధనగ్న సొగసుతో అట్టుడికిస్తున్న దీపిక పదుకొనేకి ఇంటా బయటా క్రేజ్ మామూలుగా లేదు. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె రణవీర్ ని పెళ్లాడాకా అదే స్టార్ డమ్ ని క్రేజ్ ని కొనసాగిస్తోందనడానికి నిదర్శనమిదే. ఇక పద్మావత్ నటిగా 600 కోట్ల క్లబ్ నాయికగా సత్తా చాటిన దీపికకు ఇప్పటికీ ఎదురే లేదు.ఈ బ్యూటీ మోస్ట్ అవైటెడ్ 2022 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో పోటీ జ్యూరీలో భాగం కానుందనేది అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది. ఆ మేరకు కేన్స్ నిర్వాహకులు తాజాగా వివరాల్ని తెలిపారు. పదుకొణె ఎనిమిది మంది సభ్యుల జ్యూరీలో భాగం.. సదరు జూరీ శనివారం మే 28న ముగింపు వేడుకలో పామ్ డిఓర్ తో పోటీలో ఉన్న 21 చిత్రాలలో ఒకదానికి బహుమతిని ఇస్తుంది. ఫ్రెంచ్ నటుడు విన్సెంట్ లిండన్ గౌరవనీయమైన 75వ ఎడిషన్ లో జ్యూరీకి నాయకత్వం వహిస్తారు. ఈ పండుగ మే 17-28 వరకు నడుస్తుంది. ఆ మేరకు కేన్స్ అధికారిక ట్విట్టర్ ఖాతా మంగళవారం సాయంత్రం ఈ వివరాల్ని ప్రకటించింది.ఒక ప్రకటనలో కేన్స్ దీపికను ఇలా అభివర్ణించింది. భారతీయ నటి నిర్మాత.. పరోపకారి..యు వ్యాపారవేత్త దీపికా పదుకొణె తన దేశంలో ఒక పెద్ద స్టార్. భారతదేశం నుండి అతిపెద్ద నిర్మాత.. పరోపకారి.. వ్యవస్థాపకురాలు. ఆమె క్రెడిట్ లో 30కి పైగా చలన చిత్రాలతో .. ఆమె విన్ డీజిల్తో కలిసి నటించిన లీచీలీ: ది రిటర్న్ ఆఫ్ క్జాండర్ కేజ్లో మహిళా కథానాయికగా తన ఆంగ్ల భాషా చలనచిత్ర పరిశ్రమలో నాయిక గా కెరీర్ ని ప్రారంభించింది. ఛపాక్ - '83' వెనుక నిర్మాణ సంస్థ అయిన కా ప్రొడక్షన్స్కి కూడా దీపిక హెడ్. వీటిల్లోనూ నటించింది.అలాగే దీపిక నటించిన తాజా చిత్రం 'ది ఇంటర్న్'. తన క్రెడిట్ లలో గెహ్రైయాన్ .. పద్మావత్.. అలాగే అవార్డు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రం 'పికూ' ఉన్నాయి. 2015లో దీపిక పదుకొనే.. ది లైవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ ను ఏర్పాటు చేసింది. సేవాసంస్థ కార్యక్రమాలు మానసిక అనారోగ్యాన్ని గుర్తించకుండా చేయడం .. మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2018లో టైమ్ మ్యాగజైన్ ఆమెను ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తులలో ఒకరిగా పేర్కొంది.దీపికాతో పాటు జ్యూరీలో చేరిన వారిలో ఇరానియన్ చిత్రనిర్మాత అస్గర్ ఫర్హాదీ.. స్వీడిష్ నటి నూమీ రాపేస్.. నటి స్క్రీన్ రైటర్ నిర్మాత రెబెక్కా హాల్.. ఇటాలియన్ నటి జాస్మిన్ ట్రింకా.. ఫ్రెంచ్ దర్శకుడు లాడ్జ్ లై.. అమెరికన్ దర్శకుడు జెఫ్ నికోల్స్ .. నార్వేకి చెందిన దర్శకుడు జోచిమ్ ట్రైయర్ ఉన్నారు. ఏజ్ లెస్ బ్యూటీగా మ్యారీడ్ బ్యూటీ దీపిక అదరగొడుతోంది. పెళ్లయినా క్రేజ్ తనకు కించిత్ కూడా తగ్గలేదని నిరూపిస్తోంది



# లక్నో వర్సెస్ పంజాబ్ కింగ్స్.. విజయం ఎవరిది..?



ఐపీఎల్-2022లో మరో ఉత్కంఠ భరిత పోరుకు రంగం సిద్ధమైంది. ఎంసీఏ స్టేడియం వేదికగా శుక్రవారం(ఏప్రిల్ 29) లక్నో సూపర్ జెయింట్స్తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. ఇరు జట్లు తమ చివరి మ్యాచ్ల్లో విజయాలు సాధించి మంచి ఊపు మీద ఉన్నాయి. సీస్కేతో జరిగన మ్యాచ్లో పంజాబ్ విజయం సాధించగా.. ముంబై ఇండియన్స్తో జరిగిన మ్యాచ్లో లక్నో సూపర్ జెయింట్స్ గెలిపొందింది.ఇక ఇరు జట్లు బలాబలాలు విషయానికి వస్తే.. బ్యాటింగ్ పరంగా ఇరు జట్లు పటిష్టంగా ఉన్నాయి. లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్ అద్భుతమైన ఫామ్లో ఉన్నాడు. అదే విధంగా జట్టులో డికాక్, స్టోయినిష్, మనీష్ పాండే వంటి స్టార్ బ్యాటర్లు ఉన్నారు. బౌలింగ్ పరంగా కూడా లక్నో సూపర్ జెయింట్స్ బలంగా కన్పిస్తోంది. జాసన్ హోల్డర్, దుష్మంత చమీరా వంటి అంతర్జాతీయ బౌలర్లు ఉన్నారు.ఇక పంజాబ్ కూడా బ్యాటింగ్ పరంగా దృఢంగా ఉంది. శిఖర్ ధావన్ అద్భుతమైన ఫామ్లో ఉండడం ఆ జట్టుకు కలిసొచ్చే ఆంశం. అదే విధంగా మిడిలార్డర్లో బెయిర్ స్టో, లివింగ్ స్టోన్, రాజపాక్స వంటి హిట్టర్లు ఉన్నారు. బౌలింగ్లో కూడా రబాడ, అర్షదీప్ సింగ్, రాహుల్ చహర్ కూడా అద్భుతంగా రాణిస్తున్నారు.

పిచ్ రిపోర్ట్:ఈ గ్రౌండ్లో జరిగిన చివరి మ్యాచ్లో తక్కువ స్కోర్ నమోదైంది. ఎంసీఏ స్టేడియం ఫాస్ట్ బౌలర్లకు అనుకులిస్తుంది. టాస్ గెలిచిన కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

## 'అది ఒక విచిత్రమైన కెప్టెన్సీ'.. రిషభ్ పంత్ పై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ విమర్శలు

ఐపీఎల్-2022లో గురువారం కోల్కతా నైట్ రైడర్స్తో జరిగిన మ్యాచ్లో ఢిల్లీ క్యాపిటల్స్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంలో ఆ జట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్లో మూడు ఓవర్లు వేసిన కుల్దీప్.. 14 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే అద్భుతంగా బౌలింగ్ చేసిన కుల్దీప్ను తన నాలుగు ఓవర్ల కోటాను పంత్ పూర్తి చేయించలేదు.కేవలం మూడు ఓవర్లు మాత్రమే వేయించాడు.అదే సమయంలో పార్ట్ టైమ్ బౌలర్ గా ఉన్న లలిత్ యాదవ్ తో పంత్ మూడు ఓవర్లు వెయించాడు. మూడు ఓవర్లు వేసిన లలిత్ యాదవ్ 32 పరుగులు ఇచ్చాడు. అయితే ఈ మ్యాచ్లో పంత్ తీసుకున్న నిర్ణయాలపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో పంత్ వ్యూహాలపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ ఆసంతృప్తి వక్యం చేశాడు."ఇది ఒక విచిత్రమైన కెప్టెన్సీ. మూడు ఓవర్లలో కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అటువంటి బౌలర్తో పూర్తి కోటాను ఎందకు వేయంచలేదో నాకు అర్థం కావడం లేదు" అని వాన్ ట్విటర్లో పేర్కొన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**